ప్రపంచ సాహిత్యం-41

# ఎండా-వానా

## Master Poems of the English Language

డాక్టర్ లంకా శివరామప్రసాద్

ప్రపంచ సాహిత్యం-41

# ఎండా - వానా

## (Master Poems of the English Language)

- ✧ **Andrew Marvell**
- ✧ **John Dryden**
- ✧ **John Wilmot**
- ✧ **Jonathan Swift**
- ✧ **Alexander Pope**


డాక్టర్ లంకా శివరామప్రసాద్

# ఎండా - వానా

## (Master Poems of the English Language)

Translated by

**Dr. Lanka Siva Rama Prasad**

July 2017

All rights reserved

Copyright @ 2017
by **Dr. Lanka Siva Rama Prasad**
Head of the Department
Cardiothoracic & Vascular Surgery
**Prathima Institute of Medical Sciences**
Nagunur Road, Karimnagar - 505 417, Telangana.

Published by:

**Dr. Lanka Siva Rama Prasad**
**Srijana Lokam / Writer's Corner**
Prasanthi Hospital
Sivanagar, WARANGAL-506 002,
Telangana, INDIA
Mobile : 8897849442
Email: lankasrprasad@gmail.com
**www.anuvaadham.com**

Distributed by-
All leading book centers
Visalandhra Publishing House
Navodaya Publishing House

**E-book: www.kinige.com**

Price : ₹ **200 $ 4**

Cover Design & Post Script : **Prakash Pula**

Printed at :

**Vasavi Printers**
J.P.N. Road, Warangal. Ph : 0870-2426364

***This book is presented to...***

ఈ రచనకు ముఖ్య ఆధార గ్రంథాలు

**Master Poems of the English Language**

Edited by **Oscar Williams**

# ప్రస్తావన

ఆంద్రూ మార్వెల్ (Andrew Marvell), జాన్ డ్రైడెన్ (John Dryden), జాన్ విల్మాట్ (John Wilmot), జోనాథన్ స్విఫ్ట్ (Jonathan Swift), అలెగ్జాండర్ పోప్ (Alexander Pope) ల దీర్ఘ కవితలు ఈ ఎండా–వానా అనువాద కవితా సంపుటిలో చోటు చేసుకున్నాయి.

అసలైన ఆనందం, ప్రేమల గురించి 'ఆంద్రూ మార్వెల్';
సంగీత ప్రశస్తిని 'జాన్ డ్రైడెన్';
కారణం, వివేచనలను వ్యతిరేకిస్తూ వ్యంగ్యంగా– 'జాన్ విల్మాట్';
మరణానంతర జీవితం, నీతి–అవినీతిల గురించి 'జోనాథన్ స్విఫ్ట్';
టీకప్పులో తుఫానుగా మారే అనాలోచిత కార్యాలు–పర్యవసానాల గురించి 'అలెగ్జాండర్ పోప్'
వ్రాసిన ఈ కవితలు ఆంగ్ల సాహిత్యంలో ఆణిముత్యాలు.

Syllogism, Allegory, వ్యంగ్యం, నీతిబోధలు వీటన్నిటినీ మించిన సంగీత స్పర్శ ఈ కవితల్ని అజరామరంగా చేసినాయి.

గ్రీకు, లాటిన్, జర్మనీ, రష్యన్, ఇంగ్లీషు, తమిళం, పర్షియన్ భాషా సాహిత్యాలలోని అతి ముఖ్యమైన గ్రంథాలను తెలుగులోకి అనువదించి సాహితీ ప్రియుల మన్ననలందుకున్న, సృజనలోకపు ఈ ప్రయత్నాన్ని కూడా పాఠకులు విశేషంగా ఆదరిస్తారని ఆశిస్తూ...

**– డాక్టర్ లంకా శివరామప్రసాద్**

# విషయసూచిక


**1. ఆంద్రూ మార్వెల్ (Andrew Marvell)**

తోట (The Garden) ............................................ 6

బిడియస్తురాలైన తన ప్రేయసికి ........................ 9
(To his Coy Mistress)

**2. జాన్ డ్రైడన్ (John Dryden)**

సెయింట్ సిసిలియా దినం కొరకు ఓ పాట ......... 11
(A Song for St. Cecelia's Day)

**3. జాన్ విల్మాట్ (John Wilmot)**

మానవజాతిపై వ్యంగ్యరూప కవిత ................... 14
(A Satire against Mankind)

**4. జొనాథన్ స్విఫ్ట్ (Jonathan Swift)**

డాక్టర్ స్విఫ్ట్ D.S.P.D. మరణంపై కవిత ............ 23
(Verses on the Death of Dr. Swift D.S.P.D.)

**5. అలెగ్జాండర్ పోప్ (Alexander Pope)**

శిరోజాల మానభంగం ................................ 43
(The Rape of the Lock)

**Andrew Marvel**
1628-1671

**John Dryden**
1631-1700

**John Wilmot**
1647-1680

**Jonathan Swift**
1667-1745

**Alexander Pope**
1688-1774

# ఆండ్రూ మార్వెల్

## (Andrew Marvel 1621-1678)

## 1. తోట (The Garden)

ఎంత వృథాగా ఈ మానవులు తమని తాము
అబ్బురపరచుకుంటారు. బహుమతులు, ఓకే, బైబైలతో!
వారి ఆగిపోని శ్రమలు అలంకరిస్తాయి కిరీటాలై,
వారి శిరస్సులను ఒక చెట్టు కొమ్మతోనో, పూల రెమ్మతోనో!

వాటి పొట్టి, పీల అంచుల నీడలు
వాళ్ల శ్రమలను గర్వంగా చెబుతాయి తలలు పైకెత్తి.
ఈలోగా అన్ని పుష్పాలు, అన్ని వృక్షాలు దగ్గరకు వచ్చి
నిద్రా మాలలను హారంగా అల్లుతాయి.

అందమైన ప్రశాంతతా, నిన్నిక్కడ కనుగొన్నాను నేను,
'అమాయకత్వం' – నీ సోదరిని కూడా!
చానాళ్లు పొరపాటుగా, మిమ్మల్ని, మానవుల
సాహచర్యంలో తీరిక లేకుండా ఉన్నపుడు చూద్దామనుకున్నాను.
మీ పవిత్ర లతలు దిగువన ఉన్న
మొక్కలలో మాత్రమే పెరుగుతాయి సుమా,
సమాజం చాలా మొరటుగా ప్రవర్తిస్తుంది,
ఈ స్వాదుకరమైన ఒంటరితనంపై.

ఏ తెలుపూ, ఎరుపూ కూడా
ఈ చక్కటి ఆకుపచ్చంత శృంగారంగా కనిపించవు.
పిచ్చి ప్రేమికులు, ప్రేమజ్వాలల్లా క్రూరులు,
తమ ప్రియురాళ్ల పేరును చెట్లపై చెక్కుతారు.

అయ్యో, వాళ్లకు తెలిసింది, వాళ్లు వినిపించుకునేదీ
అతి స్వల్పం; ఎంత దూరం ఈ అందాలు ఆమెను దాటి పోతాయి?

అందమైన వృక్షాల్లారా! ఒకవేళ నేను మీ బెరడును
గాయపరిస్తే, వాటిపై మీ పేరునే చెక్కుతాను, నా పేరు కాదు.

మనం ఉద్వేగాల ఉష్ణాన్ని ఉరికించినపుడు,
'ప్రేమ' తన పథాన విశ్రాంతి స్థలాన్ని చేరుకుంటుంది
మానవ సౌందర్యం వెదికే దేవతలు, తమ పరుగులు ఆపి
ఏ చెట్టు పైనో తీసుకుంటున్నారు విశ్రాంతి.

'అపోలో' వెంటాడుతున్నాడు 'డాఫ్నె' దేవతను,
ఆమె తమాల (Laurel) వృక్షంగా రూపు చెందినది.
పాన్ దేవుడు 'సిరింక్స్' వెంటపడగా,
ఆమె అప్సరసలాకాక రెల్లుగడ్డిగా మార్పు చెందినది.

ఎటువంటి అద్భుత జీవితాన్ని గడుపుతున్నాను నేను!
పండిన ఏపిల్ కాయలు నా తలపై పడుతున్నాయి.
పక్వానికి వచ్చిన ద్రాక్ష గుత్తులున్న తీగెలు,
నా పెదాల వద్ద ద్రాక్ష రసాన్ని పిండుతున్నాయి,

తేనెలూరే పీచ్ ఫలాలు తమ చెట్ల నుండి
తమంత తామే వచ్చి అందుతున్నాయి చేతికి;
నేను వెళ్తున్నపుడు పుచ్చకాయలూ, పూలూ
కాళ్లకు అడ్డం రాగా బోర్లాపడ్తున్నాను పచ్చగడ్డిపై;

ఈలోగా మనసు, తక్కువ సౌఖ్యాల నుంచి
ఆనందపు గదిలోకి అంతర్ముఖమౌతుంది
ఆ మానసిక సముద్రంలో ప్రతిదీ,
తనను పోలిన దానిని సూటిగా కనుగొన్నా,
వాటిని అధిగమించి సుదూరంగా
నూతన ప్రపంచాలను, సముద్రాలను సృష్టిస్తుంది.
అప్పటి వరకు చేసిన వాటిని నాశనం చేసి
ఆకుపచ్చని నీడలో ఆకుపచ్చని ఆలోచనవుతుంది.

ఇక్కడ, ఈ జలధార జారే పాదం వద్ద,
పండ్లచెట్ల, నాచుకమ్మిన వేళ్ల వద్ద,
దేహాల తొడుగులను పక్కకు నెట్టి
నా ఆత్మ వెళ్తుంది ఆ తరూ శాఖలలోకి
అక్కడ ఓ పక్షిలా కూర్చుని, గానం చేస్తుంది
తన వెండి రెక్కలను దువ్వి, పదును చేసి
దీర్ఘ ప్రయాణానికి సమాయత్తమైనపుడు
దాని శిఖి ఫింఛము వివిధ వర్ణాలను అలల్లా వెదజల్లుతుంది.

అటువంటిదా ఆనందవనపు స్థితి
మనిషి తనకు తోడు లేకుండా నడుస్తున్నపుడు
స్వచ్ఛమైన, మధురమైన ప్రదేశాన్ని దర్శించాక
ఇంకెటువంటి దాని సాయం కోర్తావు?
అయితే అది మానవుల కందుబాటులో లేనిది
అక్కడ ఒంటరిగా సంచరించేందుకది
రెండు స్వర్గాలు ఒక్కదానిగా కలిసి
ఆ స్వర్గంలో ఒంటరిగా జీవించడమనేది.

ఎంత నైపుణ్యంతో తోటమాలి
పూలపొదలను ఈ ఫలకంపై అమరుస్తున్నాడు!
ఏ ఎత్తుల నుంచి మందగమనపు సూర్యుడు
రాశిచక్రాన్ని పరిమళభరితంగా ఉంచుతున్నాడు!
ఏకాగ్రతతో నిరంతరం శ్రమించే తేనెటీగ
మనలాగే తనూ తన సమయాన్ని గణించడం లేదా!
అటువంటి సంపూర్ణ మధుర క్షణాలను, సమయాన్ని
పూలు, మొక్కలతో కాక వేటితో పరిగణిస్తాము?

✧✧✧✧✧

---

చేతనాచేతన స్థితులను, ఊహా వాస్తవ పరిస్థితులను వివిధ రకాల ఆందోళనలను ఫలపుష్ప భరిత ఉద్యానవనంతో పోలుస్తూ ఆండ్రూ మార్వెల్ ఈ కవితను మార్వలెస్‌గా, సంభ్రమం కలిగించేలా వ్రాసినాడు. దైహిక సుఖాలను ఏపిల్, ద్రాక్ష, పీచ్, పుచ్చకాయలతో పోలుస్తూ, అసలైన సౌఖ్యం అమరత్వపు ఆనందమనేది వివరిస్తూ మార్వెల్ ఈ కవితను అనన్యసామాన్యంగా రచించినాడు.

# 2. బిడియస్తురాలైన తన ప్రేయసికి...

## (To His Coy Mistress...)

మనకు తగినంత ప్రపంచమూ, సమయమూ ఉంటే,
బిడియస్తురాలైన యువతీ, అవి నేరాలు కావు.
మనం కాసేపు కూర్చుని, ఎటు నడవాలో నిర్ణయించుకునే వాళ్లం
దీర్ఘ ప్రేమదినాలను ఆనందించేవాళ్లం.
హిందూ దేశపు గంగానదీ తీరంలోనైనా
కెంపులను కనుగొనేవాడిని నేను.
హంబర్ ఆటుపోట్లపై ఫిర్యాదు చేసేవాడిని
జలప్రళయానికి పదేళ్ల ముందే నిన్ను ప్రేమించేవాడిని
ఓ యువతీ, నీవు నన్ను తిరస్కరిస్తూనే ఉండు,
యూదులు మారేంత వరకూ దయ ఉంచి,
నా ప్రేమలత సామ్రాజ్యాలకన్నా అధికంగా
విస్తరించనీ, కాకపోతే కాస్త నెమ్మదిగా.
నీ నేత్రాల్ని, విశాల వదనపు కాంతిని
కీర్తించడానికో వంద సంవత్సరాలు
వక్షోజాల్ని మెచ్చుకోడానికి రెండువందలేళ్లు
మిగిలిన వాటికొరకై మరో ముప్ఫైవేల సంవత్సరాలు
ప్రతి భాగానికీ ప్రత్యేకమైన యుగం
ఆఖరి యుగం తెలియబరచేను నీ హృదయం
ఓ యువతీ, నీకున్నదటువంటి అర్హత
ఇంతకంటే తక్కువ స్థితిలో ప్రేమించలేను నిన్ను సదా!

నేనెల్లప్పుడూ వింటాను నా వెనక వేపు
కాలపు రెక్కల రథం వేగంగా రావడాన్ని,
మనందరికీ సుదూరంగా పడి ఉన్నాయి,
శాశ్వతత్వపు విశాల ఎడారులు.
అక్కడ నీ సౌందర్యం కనిపించదు
చలువరాతి మాళిగ ఉండదు, నా ప్రతిధ్వనించే
పాట ఉండదు, పురుగుల పాలౌతుంది

ఎన్నాళ్లుగానో దాచుకున్న కన్యాత్వపు స్థితి.
నీ వింత గౌరవం మట్టిలో కలుస్తుంది.
నా కామం బూడిద పాలౌతుంది.
సమాధి అనేదే అందమైన వ్యక్తిగత ప్రదేశం
కాని, కౌగలించుకోడానికి అక్కడ ఎవరూ ఉండరు.

అందుచేత, యవ్వనపు మెరుపు
నీ చర్మంపై ఉదయపు మంచుబిందువుల్లా మెరుస్తున్నంత వరకూ
నీ ఆత్మ ఇచ్ఛికంగా ప్రతి రంధ్రం వద్దా
తక్షణం అగ్నులను జ్వలింప చేస్తున్నంత వరకూ
మనం ఇలా రాసలీలలో మునిగి తేలుదాం!
రాబందుల్లా చటుక్కున కాలం మనల్ని కబళించనీ,
కాలపు లఘు శక్తిలో కృంగి కృశించడం కన్నా.
మన శక్తి సామర్థ్యాలను ఇప్పుడు వెలికి తెద్దాం
మన మాధుర్యాన్నంతా కలిపి ఒక గోళంగా చేసి,
జీవితపు ఇనుప ద్వారాల్నుంచీ
మన ఆనందాల్ని గరుకు కష్టాలతో పెరికి వేద్దాం,
ఆ విధంగా, సూర్యుడిని ఒకచోట నిలబెట్టలేకున్నా
అతడిని పరిగెత్తేట్టు చేయగలం, ప్రియతమా!

✧✧✧✧✧

---

సాధారణంగా కవిత్వంలో ఊహల పాలు ఎక్కువ, వాస్తవికత తక్కువగా ఉంటుంది. నిగమన తర్క పద్ధతిలో రెండు పదాలను పోల్చి ఒక అభిప్రాయానికి వచ్చే (Syllogism) విధంగా ఈ కవితలో ఒక సిద్ధాంత ప్రతిపాదన, వేర్వేరు విషయాలతో పోల్చి చూడడం, చివరకు ఒక ముగింపుకు రావడం ఉన్నాయి.

నాకేగనక తగినంత సమయమూ, స్థలమూ ఉంటే ఇవన్నీ చేసేవాడిని అంటూ– ప్రేమికుడు బిడియస్తురాలైన తన ప్రేయసిని అర్థిస్తాడు.

Carpe diem - Seize the day – దీపముండగానే ఇల్లు చక్కబెట్టుకో– అని ధ్వనించే ఈ కవిత లో ప్రేమికుడు తన ప్రియురాలిని మంచి మాటలతో లోబరుచుకోడానికి ప్రయత్నిస్తాడు.

కవి, రాజకీయవేత్త అయిన Andrew Marvell (1621-1678) ఈ కవితను 1649కు ముందు వ్రాసినాడని విమర్శకుల అభిప్రాయం.

# జాన్ డ్రైడన్

## (John Dryden 1631-1700)

## సెయింట్ సిసిలియా దినం కొరకు ఓ పాట

## (A Song for St. Cecilia's Day)

చక్కని సామరస్యత, స్వర్గలోకపు స్వరసామరస్యత నుండి
మొదలైనది ఈ విశ్వచట్రపు అమరిక.
జలజల జారుతున్న అణువుల గుట్టకింద
ప్రకృతి దాగి ఉండి
తన తలను పైకి కదపలేక పోయినప్పుడు
పైనుంచి ఓ శ్రావ్యమైన స్వరం వినిపించింది.
లే, మరణానికన్నా అధికమా, మేలుకో.
అప్పుడు శీతలం, ఉష్ణం; తడి, పొడి
తమ తమ స్థానాలకు ఎగిరి గంతులేసి
సంగీతపు శక్తికి విధేయతను చూపినాయి.

చక్కని సామరస్యత, స్వర్గలోకపు సామరస్యత నుండి
మొదలైనది ఈ విశ్వచట్రపు అమరిక.
సామరస్యత నుండి సామరస్యత
అన్ని రకాల సంగీత ధ్వనులను ఆవరించుకుని
మానవునిలో ప్రశాంతంగా పూర్తి అయినది.

సంగీతం పెంచి,
'జుబాల్' తీగె కట్టిన శంకువును మోగించగానే
అతడి చుట్టూ మూగిన సోదరులు
ఆనందాశ్చర్యాలతో ఆ దివ్య ధ్వనులను
పూజించినారు బోర్లాపడి.
వాళ్లనుకున్నారు ఖచ్చితంగా ఆ నత్తగుల్లలో

దేవుడు తప్ప ఎవరూ ఉండలేరని.
అంత చక్కగా, మధురంగా మాట్లాడలేరని
సంగీతం పెంచి, శాంతపరచలేని ఉద్వేగమది?

బాకాలు బిగ్గరగా చేసే ధ్వనులు
మనల్ని ఆయుధాల్ని చేబట్టేలా ఉద్రేకపరుస్తాయి.
చెవులు గింగిర్లెత్తే ఆగ్రహ జనక ధ్వనులతో
మానవులకు మృత్యు హెచ్చరికలను వినిపిస్తాయి.

రెండు, రెండు, రెండు రెట్ల నాదాలతో
మృదంగాలు ఉరుముతాయి.
వాటి అరుపులు వస్తున్న శత్రువుల్ని ఆపుతాయి
దాడి చేయి, దాడి చేయి, వెనక్కి తిరగడానికి
ఆలస్యమయ్యిందంటూ.
మృదువుగా ఫిర్యాదు చేస్తున్నట్లున్న వేణువు
అస్తమిస్తున్న నాదాలలో గమనిస్తుంది
నిరాశోపహతులైన ప్రేమికుల కష్టాల్ని,
వాళ్ల విలాపగీతాల్ని వీణలు విషాదంగా గుసగుసలాడ్తాయి.

పదునైన వయొలెన్లు ప్రకటిస్తాయి
వాటి అసూయపు అరుపులను, విశృంఖలత్వాన్ని,
ఆగ్రహాన్ని, ఒళ్లు తెలియని కోపాన్ని,
బాధల లోతును, ఉద్వేగాల ఊపును.
తనకు సరితూగదని భావించే యువతిని.

అయితే, ఏ కళానైపుణ్యం బోధించగలదు,
ఏ మానవ స్వరం చేరుకోగలదు,
పవిత్ర సంగీత వాద్యాల స్తోత్రాలను;
పావన ప్రేమను ఉత్తేజపరచే నాదాలను
స్వర్గలోకపు దారులలో ఎగిరేందుకు రెక్కలనిచ్చే నాదాలను
పైనున్న గాయక బృందాన్ని మార్చే స్వర రాగాలను!

ఈ మొరటు తెగను ఆర్ఫియస్ నడపగలడా?
వేళ్లు పీకిన వృక్షాలు తమ చోటును విడిచినవి
వీణలను అనుకరిస్తూ,
అందమైన సిసిలియా ఆ అద్భుతాల్ని మరింత పైకి లేపింది.
తన సంగీత వాద్యానికి గొంతు కలిపింది.
ఒక దేవదూత విన్నది; వెంటనే ప్రత్యక్షమైనది.
భూమిని స్వర్గంగా పొరపాటు పడినది.

## గ్రాండ్ కోరస్ (బృందగానం)

పవిత్ర స్థలాల నుంచి వెలువడిన మహాశక్తితో
గ్రహాలు కదలడం ప్రారంభించాయి.
సృష్టికర్తను స్తుతిస్తూ గీతాలు పాడాయి
పైనున్న ఆశీర్వదింపబడిన వారినందరినీ కీర్తించాయి.

అందుచేత, ఆ అంతిమ భీకర ఘడియలో
శిధిలమవుతున్న ప్రదర్శన కబళిస్తుంది అన్నిటినీ!
బాకా ధ్వనులు పైపైకి ఎగసి వినబడ్తాయి
మృతులు జీవిస్తారు, జీవులు మరణిస్తాయి.
సంగీతం నింగిని నాదరహితం చేస్తుంది.

✧✧✧✧✧

---

నవంబరు 22 సెయింట్ సిసిలియా పండుగ దినం. మతం కోసం ప్రాణాలర్పించిన ఆమె సంగీతానికి రక్షక ఋషి. డ్రైడెన్ వ్రాసిన రెండు మత గీతాల్లో ఇది ఒకటి. సంగీతాన్ని ప్రస్తుతిస్తూ డ్రైడెన్ ఈ కవితను అతిలోక మధురంగా మలచినాడు.

'The trumpet shall be heard on high
The dead shall live; the living die,
And music shall untune the sky' - ఈ చక్కటి వాక్యాలు ఈ కవితకు ప్రశస్తమైన ముగింపునిచ్చాయి.

జాన్ డ్రైడన్ (19-8-1631 నుంచి 12-5-1700) కవి, విమర్శకుడు, అనువాదకుడు, నాటక రచయిత - 1668లో Poet Laureate - ఆస్థానకవిగా గౌరవింపబడినాడు.

# జాన్ విల్మాట్

## (John Wilmot 1647-1680)
## (Earl of Rochester)

# మానవజాతిపై వ్యంగ్యరూప కవిత

## (A Satire against Mankind)

నేను, (ఇప్పటికే నన్ను నేను అమ్ముకుని తెలుసుకున్నాను
ఓ వింత, విభ్రాంతికరమైన జీవి – మానవుడిగా పిలవబడుతున్నాడని)
నేను స్వేచ్ఛాజీవినా, నా వాటా నేను ఎంచుకుని పంచుకోగలనా,
ఏ రక్త మాంసాలను ధరిస్తే నేను సంతోషిస్తాను!
నేను కుక్కనైనా, కోతినైనా, ఎలుగుబంటినైనా
ఏదైనా నాకు సమ్మతమే, ఆ ఒక్క వ్యర్థజంతువుగా తప్ప!
హేతువాదినని గర్విస్తాడు, ఈ మానవుడు.
పంచేంద్రియాలు దట్టమై, ఆరో దాన్ని కనిపెట్టి
దానితో ఈ అయిదింటినీ ఖండిస్తాడు.
ఏదో అంతర్బుద్ధి సహజ ప్రచోదనతో, వివేచనా శక్తి అనే
కారణాన్ని కావలించుకుని, యాభై తప్పులు చేస్తాడు.

కారణమనేది మనో చిత్తడువుల్లో మెరిసే భాస్వరకాంతి
ప్రకృతి కాంతిని విడిచి, ఇంద్రియాలను వదిలి
దారి తెన్ను లేకుండా, ప్రమాదకర మార్గాల్లో తిరుగుతుంది అది.
దోషపూరిత ఊబి అడుసుల్లో, ముళ్లపొదల్లో, మానవుడు
దారిమళ్లించిన అనుచరుడిలా బాధతో పడుతూ, లేస్తూ,
ఎక్కుతాడు వింత పర్వతాలు, తన మెదడులో కుప్పపోసినవాటిని.

ఆలోచన నుంచి ఆలోచనకు మారుతూ పడతాడు
తలకిందులుగా అనంత సందేహాల సముద్రంలో.
అలా మునుగుతుంటే పుస్తకాలు సాయం చేస్తాయి కొంతవరకు
వేదాంతపు మూత్రాశయాల బంతుల్నిస్తాయి ఈదడానికి,

తప్పించుకుపోతున్న వెలుగును దాటిపోవాలన్న ఆశతో ఉన్నవాడికి,
చెదిరిన అతడి కన్నులకాంతి ముందు ఆవిరి రేణువులు
నృత్యం చేస్తాయి, అయిపోయాక అతడిని వదిలివేస్తాయి.
శాశ్వత రాత్రిలో; అప్పుడు వృద్ధాప్యం, అనుభవం–
చేతిలో చేయి వేసుకుని మృత్యువు వేపు నడిపిస్తాయి.
అటువంటి బాధాకరమైన అనుభవం తరువాత
అతడికి అర్థమయ్యేట్లు చేస్తాయి - దీర్ఘకాలం
జీవితమంతా తప్పు దారిలో నడిచాడనీ–
దుమ్ములో మునిగి ఉన్నవాడికి, కారణం చెబుతాయి అసత్యాలు
గర్వంగా, హాస్యచతురుడై, తెలివిగలవాడై ఉండీ కూడా
వంచకుల్లా గర్వమతడిని మోసం చేయగా అతడు
వాళ్ల గాలిబుడగల్ని పట్టుకో ప్రయత్నం చేసి చేసి
సంతోషం లేనివాడిగా, దురదృష్టవంతుడౌతాడు.

అతడి ఈ జ్ఞానం సంతోషాన్ని నాశనం చేస్తుంది
అతడు ఆనందించాల్సిన స్వర్గం వేపు చూపిస్తుంది.
వ్యంగ్యోక్తి అతడి ఉపయోగం లేని, విలువలేని నటన
తనను తాను కించపరుచుకుని ఇతరుల్ని సంతోషపెట్టడం
ఎందుకంటే హాస్యోక్తుల్ని జనం వేశ్యల్లా భావిస్తారు
ఆనందం పొందినాక ద్వారం బయటకు గెంటేస్తారు
సంతోషం గడచిపోతుంది, భయపెట్టే సందేహం మిగుల్తుంది
కాముకుడిని భయపెడ్తుంది, అంచెలంచెల బాధలతో
చతురత గల స్త్రీపురుషులు ప్రమాదకరమైన పనిముట్లు.
మెచ్చుకునే మూర్ఖులకు అశనిపాతాలు.
సంతోషాలు ఊరిస్తాయి, బాహ్యాడంబరాలు తప్పించుకునేప్పుడు
వాళ్లు ప్రియతములని కాదు, కాని, అదృష్టవంతులు
వాళ్లు భయపడే దానినే ద్వేషిస్తారు.

నేననుకుంటాను ఏదో మామూలు పట్టీ లేదా గడ్డం
నాతో పని చేయిస్తుంది. ఆర్యా, నేను సిద్ధమే.

నీ మెప్పుకొరకు ఏదైనా వ్రాసినా
ఈ అబద్ధాల మెరుపు సవ్వడి లాంటి వ్యంగ్యోక్తి
నన్నెంతో ఇష్టపడ్తుంది; కాని, జాగ్రత్తగా ఉండు
ఈ బిందువు తర్వాత మరీ తీవ్రంగా ఉండకు.
బహుశా నా లలితకళాధిదేవత– మ్యూజ్
ఈ పనికి సరియైనదని భావిస్తున్నాను నేను.
ఎందుకంటే నేను జోస్యం పలుకుతున్నాను
–నేను వ్యంగ్యోక్తులలో సాటిలేనివాడిని, చతురుడిని గనుక
కాని, వాటిని నేను హృదయం లోలోన ద్వేషిస్తున్నాను గనుక.
ఓ పదునైన దీర్ఘ వ్యాసం వ్రాసి ఖండించదలుచుకున్నాను
అయితే, నీ గొప్ప అవివేక ప్రవర్తన నన్ను ఆగమని కోరుతున్నది
నా సిరా వరదను ఇంకోదారిలోకి మళ్లిస్తున్నది
నీ పాడైపోయిన మనసులో ఏ ఆగ్రహం ఉడుకుతున్నదో,–
నిన్ను మానవజాతికి, కారణానికి సమర్థకుడిని చేసినది?
ప్రకాశవంతుడైన మానవుడా, ఆశీస్సులు! స్వర్గం దయతో
నీకొక్కడికే స్వేచ్ఛాపూరిత శాశ్వత ఆత్మను ప్రసాదించింది.
సృష్టికర్త ఎంతో జాగ్రత్తగా మలిచి నీకిచ్చినాడు దానిని.
తన రూపుగా దానిని తీర్చిదిద్దినాడు.
ఇంత చక్కని ఆకారానికి మెరిసే కారణాన్ని తొడిగినాడు
నీ స్వభావాన్ని హుందాగా ఉంచడానికి జీవజంతువులకు పైన నిలిపినాడు.
కారణము (Reason) – ఎవరి ప్రోత్సాహంతో అయితే
మనం భౌతిక పరిధుల్ని దాటి పైపైకి పయనిస్తామో
మార్మిక రహస్యాల లోతుల్లోకి దూసుకుపోయి, మరల నింగికెగిరి
జ్వలిస్తున్న విశ్వపు అంచులను చేరుకుంటామో
స్వర్గాన్ని నరకాన్ని శోధించి, అక్కడేం జరుగుతుందో పరిశీలించి
ఈ ప్రపంచానికి ఆశ, భయాల నిజస్వరూపాల్ని తెలియజెబ్తాము.
శక్తివంతుడైన మానవుడా, నేను దుఃఖిస్తున్నాను. ఇదంతా
మనకు తెలుసు; ఇంగెల్లో విచారగ్రస్త కలం నుంచీ,
పాట్రిక్ తీర్థయాత్రికుడి నుంచీ, సిబ్బ్ స్వగతం నుంచీ,–

ఇందుకే నేను కారణాన్ని, ఈ సమర్థననూ ద్వేషిస్తాను.
ఈ అతిలోక బహుమతిని; ఓ చిన్న సాలెపురుగు
తాను అనంతత్వపు చిహ్నాన్నని తలపోస్తుందని,
తన అల్పకాల జీవితాన్ని, విశ్రాంతిలేని నిరంతర శ్రమను,
శాశ్వతుడు, సర్వవ్యాపకుడైన సృష్టికర్తతో పోల్చుకుంటూ-

ఈ ఆశ్చర్యం గొలిపే, తికమకపెట్టే, సందేహం, అదే,
నిగూఢ మార్మిక రహస్యాలను రూపొందించేదీ, మరల కనుగొనేదీనూ.
ఆలోచించే మూర్ఖుల, వెర్రెత్తిన గుంపుల్ని కూడగట్టి
పవిత్ర పిచ్చాసుపత్రులు, కళాశాలలు, పాఠశాలలు నింపి
వాళ్ల రెక్కలపై ప్రతి తాగుబోతూ ఎగురుకుంటూ
అనంత విశ్వపు పరిధుల్ని చేరుకున్నట్లు
వాటికోసం మంత్రతంత్రాల అంజనాలు, వాటితో వృద్ధ మంత్రగత్తె
ఆకాశయానాలు, వంగి కృంగి శవరూపంగా నింగిలో ఎగరడాలు
ఇది ఈ గొప్ప శక్తి అధికారం కోసం వీళ్ల అనంత శ్రమలు
అసందర్భపు వాగుడులు, అసాధ్యపు ఊహలు
ఇవి విపరీత ధోరణుల వేదాంతిని తయారుచేస్తాయి.
ఈ విశాల ప్రపంచానికి బదులు, అతడి స్నానాల తొట్టిని కోరుకుంటాయి.
మన నవీన డాంబిక మత సన్యాసుల మఠాలు, ముఠాలు
విశ్రాంతి తీసుకుంటూ ఆలోచిస్తుంటారు, ఎందుకంటే వాళ్లకు
చేసేందుకు పనేం లేదు గనుక.
అయితే, ఆలోచనలున్నది చేసే పనుల్ని అదుపులో పెట్టేందుకు,
కార్యం నిలిచిపోతే, ఆలోచన ఆగిపోతుంది
మన పనుల, కార్యాల పరిధి, జీవితపు ఆనందమే కదా!
అంతకన్నా ఎక్కువ ఆలోచించేవాడు అడ్డగాడిద.
ఈ విధంగా నేను తప్పుడు ఆలోచనలను తప్పు పడుతున్నాను.

నాకు సరైన సమర్థన కారణమున్నది, దానిని నేను
శిరసావహిస్తాను. దానిని ఇంద్రియ జ్ఞానం సమర్థిస్తుంది
నియమావళి రూపొందుతుంది మంచీచెడులను వేరు చేస్తూ-

కోరికలను అదుపులో పెడ్తూ, స్వేచ్ఛా ప్రవర్తనను మార్పు చేస్తూ
వాటిని మరింత చురుకుగా ఉంచుతుంది. చంపమని చెప్పదు.
నీ కారణం, సమర్ధన అడ్డుపడ్తాయి, నా కారణం ఆనందాన్నిస్తుంది
ఆకలిని పునరుజ్జీవింపజేస్తుంది, నీది నాశనం చేస్తుంది.
నా 'కారణం' నా స్నేహితుడు. నీది వంచకుడు, మోసగాడు!
ఆకలి కేకలు పెట్టినపుడు నా 'కారణం' అన్నం పెడ్తుంది.
నీ 'కారణం' లాగి చెంపలు పగలగొట్టి హేళన చేస్తుంది.
ఇది ఆహారమడిగితే అది గడియారం గురించి చెబ్తుంది.
ఈ తేడాను, ఆర్యా, నీ సందేహం పసిగడ్తుంది.
నేను సహేతుక కారణాన్ని తిరస్కరించను, కాదనను.
సహేతుక కారణమనేది మనిషిని సరైన మార్గంలో నడపాలి
వీలైతే అతడిని కాపాడుకోవాలి!
అతడి గర్వం, అతడి వేదాంతం వాటి కోసమైనా రక్షించుకోండి!
జంతువులు వాటి పరిధుల్లో తెలివిగలవే, ఆ మాట
ఋజువైనదే కదా, చాలాసార్లు మానవులకన్నా మెరుగే జంతువులు
అవి తెలివిగలవి కాబట్టే వాటి లక్ష్యం,
దానిని ఛేదించడం వాటికి తెలుసు.
కుక్క కుందేళ్లను పసిగడ్తుంది, వేటాడి చంపుతుంది.
మన రాజకీయవేత్తలు, సమావేశాల కుర్చీలకై ఉరికేవాళ్ల
కన్నా అవి మెరుగేననిపిస్తుంది.
మీరే చూడండి మానవుడి జ్ఞానమెంత దూరం ప్రసరించిందో
తర్వాత గమనించండి, ఉన్నదానికి ఎన్ని మార్పులు చేర్పులు చేస్తుందో
ఎవరి సిద్ధాంతాలు సరైనవో, ఆచరణయోగ్యమైనవో
ఎవరి నైతిక భావనలు త్వరలో నీవు విశ్వసిస్తావో
నీకు నీవే న్యాయనిర్ణేతవుకా, నేను పరీక్షకు నిలబెడ్తాను వాటిని.
మనిషా, జంతువా ఏది హీనమైన జంతువు?
పక్షులు పక్షుల్ని, జంతువులు జంతువుల్ని తింటాయి.
కాని రాక్షస మానవుడు మోసం చేసి తింటాడు.
ఆహారం కొరకు మాత్రమే అవి వేటాడతాయి.

మనిషికి అటువంటి పట్టింపులు లేవు. వేట వాడికిష్టం.
జంతువులకు ప్రకృతి ప్రసాదించింది వాడి గోళ్లను, దంతాలను,
వాటి నిత్యావసరాలను ప్రకృతి తీరుస్తుంది.
కాని మానవుడు నవ్వుతూ, కౌగిలిస్తూ, స్నేహం చేస్తూ,
పొగుడుతూ అమానవీయంగా మోసం చేస్తాడు తన తోటివాళ్లను.

ఐచ్ఛికమైన బాధలతో దుఃఖానికై శ్రమిస్తాడు.
అవసరంకొద్దీ కాదు, అంతులేని ఆశతో, కోరికతో.
ఆకలికోసం ప్రేమకోసం పోట్లాటలూ, హత్యలూ
భయం పెట్రేగిపోతుంటే ఆయుధాలతో రక్షణ వ్యూహాలూ.
భయమున్నదని ఆయుధాలు, ఆయుధాలున్నాయని భయం
భయం వలన, భయంతో వరుసగా పలుమార్లు మోసపోయినా
మూలభయం, ఎక్కడినుంచీ అయితే అతడి ప్రధాన ఉద్వేగాలు జనించాయో
అతడు గొప్పలు చెప్పుకునే గౌరవం, అతడికి కీర్తి తెచ్చినది
ఆ అధికార దాహం, దానికతడు బానిస,
దానికోసమే అతడిన్ని సాహసాలు చేసింది,
అతడి వివిధ ప్రణాళికలన్నీ అందుకే,
అందుకే అతడు కనిపిస్తాడు దాతగా, ప్రేమమూర్తిగా, దయగలవాడిగా.
దానికోసమే అతడు తెలివిగా ప్రణాళికలు రచిస్తాడు
బలవంతపు మారువేషంలో తన పనులను బిగిస్తాడు.
దుర్భర జీవితాన్ని నిస్సారంగా గడుపుతాడు
ఆత్మవంచనతో, అధిక శ్రమతో
అతడి చూపులన్నీ అతడి దీర్ఘ విశాల ప్రణాళికలున్న కిందవేపే!
ఎక్కడైతే మానవుడి తెలివి, అధికారం, కీర్తి కలుస్తాయో అటువేపే!
అప్పటివరకు అతడు మంచివాడిగా నటిస్తాడు, చెడు భరిస్తాడు.
అంతా భయం వల్లనే, తనని తాను రక్షించుకోవడం,
మనుషులందరూ పిరికివాళ్లే, భయపెడితే,
సాధారణ స్వభావానికి విరుద్ధం నిజాయితీ.
మనుషులు మోసగాళ్లెందుకంటే అదే వాళ్లకు ఆత్మరక్షణ.

మానవజాతి వంచనాస్వభావం సరైనదని నీవనుకుంటే
లోకమెరిగిన మహామాయగాళ్ల ముందు
బరిలో నీవు ఘోరంగా ఓడిపోతావు.
సత్యమెప్పటికీ అదే, నీ పేరు నిన్ను కాపాడ్తుంది.
మాయగాళ్లు నిన్ను మాయగాడిగా అంగీకరిస్తారు
తప్పుచేసినా సర్దుకుపోతారు,
మిగతావాళ్లకన్నా కాస్త తక్కువ క్రూరుడు చిన్నబుచ్చబడతాడు.
మానవనైజం కోరుకుంటున్నది, ఆర్యా! అదే!
ఎక్కుమంది మనుషులు పిరికివాళ్లు,
అందుకే అందరూ జిత్తులమారులుగా మారాలి.
తేడా అల్లా నాకు తెలిసినంత వరకూ
వంచనలోకాదు, దాని అంశలో మాత్రమే.
ఈ అంశమే చర్చకు వస్తుంది, ఈ మానవ గుంపులో
మోసగాళ్లకు మోసగాడెవరని?

నేను విసిరిన ఈ ద్వేషపు శలాకలు,
ఈ ప్రపంచపు నటనాముఖం వేపు!
స్వార్థపు ఆడంబరాలతో, అబద్ధపు స్వేచ్ఛలను,
పవిత్ర వంచనలను, సులువైన అసత్యాలను
వినియోగించి తోటి బానిసలను భయపెట్టేవాళ్ల మీదకు.

అయితే, న్యాయస్థానంలో, నీతివంతుడైన మనిషుంటే
(నీతిమంతుడా, ఇంతవకు నాకు కనబడలేదులే!)
తన అవసరపు పొగడ్తలను తనపై కురిపించుకుంటూ
తనని తాను అణుచుకోడానికి, నాశనం చేసుకోడానికి కాదు,
తనని తాను కాపాడుకోవడానికి, ఏదో ఒక మార్గంలో,
నిజానికది ఓ రకమైన పన్ను, ఆ ఆనందరహిత వ్యాపారానికి,
ఎవడైనా రాజకీయవేత్త గుణవంతుడు, ముక్కుసూటిగా
నడిచేవాడు నీకు కనిపిస్తే,
అతడి ఉద్వేగాలను అతడి దారి తప్పని మనసు నియంత్రించగలిగితే

తన పనులకు, విధానాలకు వాటిని వర్తింపచేయగలిగితే
తన కుటుంబాన్ని కాక, తన దేశాన్ని పైకి తేగలిగితే,
భౌతిక లాలసల, సంపదల గర్వం లేకపోతే
స్నేహితుల హస్తాల నుండి స్వర్ణ కానుకలను లంచాలుగా స్వీకరించకపోతే
అటువంటి వాడు కనిపిస్తే నాకు తెలియజేయి.

దేవుడు నమ్మదగిన చర్చి, మనిషి ఉన్నాడా?
అతడి జీవితం, విశ్వాసం, సిద్ధాంతం సమర్థనీయమైనవేనా?
పూర్వ సిద్ధాంతాల గర్వంతో, పాపాలకు ఋజువు కావాలంటూ
మనిషిని హేళన చేస్తూ ఉబ్బినవాడెవడైనా ఉన్నాడా!
అసూయ చెందిన హృదయం విచ్చలవిడిగా ధ్వనిస్తూ
రంపపు కోతలా ఉపన్యసిస్తున్నట్లుంటే
రాజుల్ని దూషిస్తూ, జ్ఞానమున్న వాళ్లను చిన్నబుచ్చుతూ,
చర్చిలోని మతబోధకుని వేదిక మీద నుంచి
మరిన్ని అబద్ధాలు పలుకుతూ, తిట్లు, నిందలు,
పరువు నష్టపు మాటలు, పుకార్లు లేవనెత్తుతూ
గుణవతులైన భార్యలు తాగి తందనాలాడుతూ పతనం చెందగా
ఈ జాతి, వీళ్ల గొప్పతనమంతా దురాశ, గర్వం,
సోమరితనం, తిండిపోతుతనంలో చూపెడ్తారు.
మంచితనాన్ని వేటాడుతూ, మంచివారిని ద్వేషిస్తారు.
కామానికి పెద్దపీట వేసి, వ్యభిచారులై
స్వంత భార్యలతోనే నేరాలు చేస్తారు, చేయిస్తారు.
ఇరవై ఏళ్లు ఇలా పూర్తయ్యాక
మత బోధకుల వేదికపై నుండి గర్వంగా చూడవచ్చు
వాళ్ల సంతానమే వచ్చిన సందర్శకుల్లో సగం.

సిగ్గుమాలిన వెధవలు వీళ్లని మెచ్చుకుంటారు
వీళ్లు సమావేశంలో గట్టిగా వాదిస్తారు గనుక.
ఎనభై ఏళ్ల పెద్దమనిషి గంభీరమైన బొమ్మల్ని అమ్మేవాడు

ఇరవై ఏళ్ల మెరిసే మూర్ఖుడి చేతిలో ఓడిపోతాడు,
ధగధగ మెరిసే దుస్తులు, ప్రేమలు, హంగూ వీడి స్వంతం కదా.

మంచి జ్ఞానమున్న వ్యక్తి, శాంతిని ప్రబోధించేవాడు
నిరంతర ఏకాగ్రతతో గడుపుతాడు, పవిత్ర జీవనం.
అతడి జీవితమే ఒక ఆదర్శమైన పాఠం.
ఏ మనిషీ ఊహించలేని మార్మిక సత్యాలు అతడు గ్రహిస్తాడు.
దేవుడిలాంటి మనుషులు ఈ నేలపై తిరుగాడ్తుంటే
వారికి నేనీ అసంబద్ధతను తిరిగి వినిపిస్తాను.
వారి గుణశీలాలను ప్రస్తుతిస్తూ, అంజలి ఘటిస్తాను.
వారి న్యాయాల్ని ఈ జనసందోహలోకం అనుసరిస్తుంది.
అటువంటి వారుంటే, నాకీ జ్ఞానాన్ని ప్రసాదించు కనీసం,
మనిషికీ మనిషికి మధ్య ఎక్కువ తేడా ఉన్నదని,
మనిషికీ జంతువుకూ మధ్య ఉన్న తేడా కన్నా!

✧✧✧✧✧

---

జాన్ విల్మాట్ – ఎరల్ ఆఫ్ రోఛెస్టర్ (1647–1680) వ్రాసిన A Satire against Mankind అనే ఈ కవిత ఆంగ్ల సాహిత్యంలోని 'అత్యంత పదునైన కవిత'గా ప్రసిద్ధి కెక్కినది. మానవజాతిపై తనకున్న ఆగ్రహాన్ని, నిరాశను, బాధను వ్యంగ్యంగా, సునిశితంగా విమర్శిస్తూ సాగే ఈ కవితకు సాటివచ్చే కవిత ఇంకొకటి లేదు.

రెండవ ఛార్లెస్ ప్రభువుకు దగ్గరివాడైన జాన్‌విల్మాట్ తన అధిక ప్రవర్తనతో ఎన్నోసార్లు బహిష్కరణకు, క్షమాభిక్షలకు గురైనాడు. అతడిపై పడిన నిందలకు లెక్కేలేదు. వ్యంగ్యంతో కూడిన నిశిత పదజాలం అతడికి మిత్రుల్ని, శత్రువుల్ని అసంఖ్యాకంగా సమకూర్చింది.

మానవుడికి జంతువుకు ఉన్న ముఖ్యమైన తేడా వివేచనాశక్తి (Reason). కారణం గురించి ఆలోచించడమనే స్వేచ్ఛాప్రవృత్తిని అతడు తీవ్రంగా విమర్శించినాడు. ప్రకృతి వెలుగు అయిన ఇంద్రియజ్ఞానాన్ని వదిలి, చంచలమైన కారణాన్ని, జంతు స్వభావాన్ని మానవుడు అవలంబించి తన మానవజాతికి, ప్రపంచానికి చెడు చేస్తున్నాడని 'విల్మాట్' అభిప్రాయబడినాడు.

న్యాయం, రాజకీయం, మతం వీటన్నిటిని నిశితంగా ఖండించినాక విల్మాట్ ఆఖరిమాట అంటాడు–

'మనిషికీ జంతువుకూ మధ్య ఉన్న తేడా కన్నా
మనిషికీ, మనిషికీ మధ్య ఉన్న తేడా ఎక్కువ" –అని. నిజమే కదా!

# జొనాథన్ స్విఫ్ట్

## (Jonathan Swift 1607-1745)

## డాక్టర్ స్విఫ్ట్ D.S.P.D. మరణంపై కవిత

## (Verses on the Death of Dr. Swift, D.S.P.D.)

(In Padversite of our best friends
we find something that we donot deplaist)

రొఛెఫొకాల్టు చెప్పిన నీతివాక్య సారాంశమిదే
ప్రకృతి నుంచి నేర్చుకున్న పాఠం కదా, నమ్ముతాను నేను.
వాళ్లు వాదిస్తారు అతడిలో కలుషితమైన మనస్సు
లేదని, లోపమంతా మానవజాతిదేనని.

మిగతా నీతులన్నిటికన్నా ఇది చాలా ప్రాథమికమైనది
–'మన స్నేహితుల కష్టాలలో కూడా మనం
మన వ్యక్తిగత లాభాలను సమీక్షిస్తాం
ప్రకృతి దయతో మనలను శాంతపరచి
మనల్ని సంతోషపెట్టే పరిస్థితిని చూపిస్తుంది'–

ఇది నీ సహనాన్ని కదిలిస్తుందా,
కారణం, అనుభవం ఋజువు చేయనీ!

మనం అసూయ నిండిన కన్నులతో చూస్తాం
మనకు సమానమనుకున్నవాడు మనకన్నా పైకెగిస్తే!
గుంపులున్న ప్రదర్శనలో వాడు పైనుండి
మిగతావాళ్లను అడుగున ఉంచడం?
నేను నా స్నేహితుడిని నిన్ను ప్రేమిస్తాను
కాని అతడిని నా దృష్టిని ఆపకుండా చూస్తాను.
అతడు నాకన్నా పైస్థానంలో ఉండవచ్చు
నేను ఓ అంగుళం ఎక్కువ అడుగుతాను.

యుద్ధంలో నీవు కనుక్కోవాలి
మానవజాతి మొత్తంలో నీకిష్టుడైనవాడిని
వీరోచిత కార్యం చేసినవాడిని
వీరమరణం చెందినవాడిని, విజయాన్ని సాధించినవాడిని
ఆవిధంగా పైకెక్కిన వాడిని కూడా
నీవనుకోవా అతడి కీర్తిలతలు కత్తిరించబడాలని?

నిజాయితీ గల బాధ 'గౌట్' కీళ్ల నెప్పిలో ఉంది
అంతులేని బాధ, కేకలు; నీకు లేవు.
ఎంత ఓర్పుతో వింటావు నీవు అతడి అరుపులు!
ఆ కష్టం నీకు రానందుకెంత సంతోషిస్తావు!

ఏ కవి కుమిలిపోడు అసూయతో.
మిగతావాళ్లు తనంత బాగా వ్రాస్తున్నారని తెలిసి?
వాళ్లు ఇంకా బాగా వ్రాయాలని కోరుకోడు,
తన ప్రతిద్వంద్వులు నరకంలో పడాలని ఆశిస్తాడు.

ఎవరైనా తనను మెచ్చుకోకపోతే
అసూయతో ఆమె కుడ్తుంది, బుసలు కొడ్తుంది.
దృఢమైన స్నేహం కూడా గర్వానికి చెదుర్తుంది
అదృష్టం మనవేపు ఉంటే తప్ప.

ఆడంబరపు మానవజాతి! అద్భుతమైన తెగల సంస్కృతి
చేసిన తప్పుల్ని ఎవరు కనుగొనగలరు?
స్వకీయ ప్రేమ, ఆశయం, అసూయ, గర్వం
మన హృదయాల్లో వాళ్ల సామ్రాజ్యం విడివడుతుంది.
ఇతరులకు ఇచ్చేయి సంపదలు, అధికారం, పదవులు.
–'ఇవి అన్నీ నాపై ఆక్రమణా రూపాలు
ఇక్కడ నేను ఆశించే బిరుదులూ లేవు
అయినా నీవు మునుగుతుంటే నేను పైనున్నట్లుంటాను

'పోప్'లా, ఒక్క వాక్యం చదవలేను
కాని, అది నేనే అంటే బాగుండేదని నిట్టూర్పు విడుస్తాను.
అతడు ఒక్క ద్విపదలో చెప్పింది
నేను ఆరు వాక్యాల్లో కూడా చెప్పగలుగుతాననుకోను.
అది నాకు ఎంత అసూయ కలిగిస్తుందంటే
నేను అరుస్తాను, అతడి కవిత్వంలో లోపాలు వెదుకుతాను.

ఎందుకు నేను ఆనందంతో ఓడింపబడాలి,
నా సహజ వ్యంగ్యోక్తుల కోరలతో కొరికేప్పుడూ కూడా?

అర్బత్‌నాట్ ఇప్పుడు నా స్నేహితుడు కాడు
వ్యంగ్య చతురతతో వ్రాయబూనినాడు
నేను పుట్టిందే అలా వ్రాయడానికి,
దాన్ని మెరుగుపరచి విరివిగా వాడిన వాడిని.

సెయింట్ జాన్, పుల్ట్నీలకు తెలుసు
నాకు వచన కవిత్వంలో పేరుందని
నాకు పని లేకుండా తరిమివేస్తారు
అవసరమయితే రాష్ట్రమంత్రిని దెబ్బతీస్తారు
నా గర్వాన్ని చంపేయగలిగితే
వాళ్లు నా కలాన్ని పడవేయగలరు
అటువంటి నైపుణ్యాలు స్వర్గం వారికిచ్చింది.
వాళ్లను ద్వేషించడానికి చాలవా ఈ కారణాలు?

అదృష్టదేవతా, నా శత్రువులందరికీ బహుమతుల్ని
పంపు, నా మిత్రులకు వద్దు సుమా!
శత్రువులను నేను భరించగలను
మిత్రుల అసూయ నేను తట్టుకోలేను.

ఇది ముందుమాట, ఇప్పుడిది కవిత్వపు బాట.

కాలమెంతో దూరంలో లేదు,
ప్రకృతి సిద్ధంగా నేను చనిపోక తప్పదు
నా ముఖ్యమైన స్నేహితుల భవిష్యత్తులోకి చూస్తున్నపుడు
వాళ్ల స్వంత లక్ష్యాలను గమనిస్తాను నేను.
అది ఏమాత్రం అర్థం కాకపోయినా
నా మరణం వాళ్లకే రకంగా మంచి చేస్తుందో
అని ఆలోచిస్తాను, వాళ్ల మాటలను వింటాను.
చూడు, ఆ విద్యాశాఖాధిపతి– డీన్ ఏమైపోతున్నాడో
పాపం, అంత పెద్దమనిషీ, భుజాలు వంగీ,
అతడి ముఖంలో స్పష్టంగా చూడవచ్చు
పాతరోగం తలతిరగడమనేది
అతడు చచ్చిపోయేంత వరకు అది వదిలిపెట్టదతడిని.
దానికి తోడు, అతడి జ్ఞాపకశక్తి నశించింది.
అతడు చెప్పింది అతడికి గుర్తుండదు
తన స్నేహితులను గుర్తు తెచ్చుకోలేడు
నిన్న ఎక్కడ భోంచేసాడో జ్ఞప్తికి రాదు
పదేపదే అదే కథలు చెబుతాడు
ఇంతకు ముందు యాభైసార్లు చెప్పినవే అవి
ఎలా తట్టుకోగలుగుతాం మనం,
అతడి పాతకాలపు హాస్యాన్ని?
అందుకని అతడు యువతతో కూర్చుంటాడు,
వాళ్లు ఇంత 'వైన్' కోసం అతడిని భరిస్తారు.
అతడు తన కథల్ని సంక్షిప్తమన్నా చెయ్యాలి
లేదా పదిహేను రోజులకోసారి స్నేహితుల్నన్నా మార్చాలి
సగం సేపట్లో అతడు పూర్తిగా మాట్లాడేస్తాడు
మళ్లా ఇంకో గుంపు కావాలి మొదలెట్టేందుకు.

కవిత్వమంటావా, అతడి యవ్వనకాలం గడచిపోయింది
ఒక ప్రాస కుదరడానికో గంట పడుతుందిప్పుడు

అతడిలో అగ్ని తగ్గింది, హాస్యం నశించిపోయింది.
అతడి ఆలోచనలు ఊహలు అంతర్ధానమైనాయి,
అతడి ఆరాధ్య దేవత ఆకుపచ్చటి జేడ్ శిల్పం,
అతడు కలం పారేస్తే బాగుండు ననుకుంటాను, కాని,
కొందరితో మాట్లాడడం చాలా కష్టం.

అప్పుడు వాళ్ల మృదుత్వం కనిపిస్తుంది.
అది నా వయసుకు అదనంగా వస్తుంది
అతడి వయసుకన్నా అతడు పెద్దవాడు
రెండవ ఛార్లెస్ రాజులా పరిగణించబడ్డాడు.
"ఒక పాత్ర మధువు పూర్తిగా తాగలేదు అతడు
అది ఖచ్చితంగా మంచి సూచన కాదు.
అతడి అరుగుదల తగ్గిపోయింది.
క్రితం సంవత్సరం ఆరోగ్యంగానే కనిపించాడు
ఇప్పుడు అతడి పరిస్థితి వేరు
వసంతకాలం దాకా ఉంటాడో లేడో తెలీదు"-

అలా కౌగలించుకుని, కారణాలు వెదుక్కుని
'మన పరిస్థితి అంత దారుణంగా లేదు' అని సమర్థించుకుంటారు.

అటువంటి విషయాలు గుంపులుగా చర్చించి
భయాలతో వాళ్లు ఆశల్ని వెలిబుచ్చుతారు
గొప్ప ఆపదను, దురదృష్టాన్ని జోస్యం చెప్పడంలో
ఏ శత్రువూ స్నేహితుడికి సాటిరాడు.
వారు దయతో జాలితో ప్రబోధించేది
కలిసివచ్చిన అదృష్టపు గొప్పతనాల్నే.
(వాటికి ప్రతిరోజూ కరచాలనాల స్పర్శ ఉంటుంది కదా
సేవకులు సమాధానమిస్తారు, అది హీనాతిహీనం)
అది వారిని సంతోషపరుస్తుంది,
దేవుడు గొప్పవాడని, మృత్యువు గొప్పదని చెప్పడం.

ఎవరైతే గొప్ప జోస్యాలు చెబుతారో అతడు
తన ముందు చూపును, కాలజ్ఞానాన్ని ఇతరులకిస్తాడు.
–“నేను ముందే చెప్పాను, సర్వనాశనం అవుతుందని,
నేను చాలాసార్లు మీతో అన్నాను, అవునా!”–

దానికంటే అతడు నేను చచ్చిపోతానని చెబితే
అతడి జోస్యం తప్పని ఋజువయ్యేది
నేను బాగుపడతానని ఎవరూ చెప్పరు
కాని, అందరూ, నా పనైపోయిందని ఒప్పుకుంటారు.
పొరుగువాడికి కలిగిన బాధలాంటిదే,
నాకూ ఉన్నదని నేను చెబితే,
ఎన్ని సందేశాలు పంపుతాడు అతడు నాకు?
ఎటువంటి గొప్ప ప్రార్థనలను చేస్తాను నేను?
నేను పాటించే పద్ధతులేమిటి,
ఏది నా నెప్పిని తొలగించింది, ఎలా నిద్రపోయాను నేను?
నేను మరణించాక ఏడ్చేదెందరు?
ఇవి ఆలోచిస్తాను, నా మంచం చుట్టూరా గుమికూడి
దుఃఖిస్తున్న వాళ్లను వదలి.

నా మంచి సహచరులారా, భయపడకండి,
మీరు ఓ ఏడాది తప్పుగా లెక్కించవచ్చు
మీరనుకున్న ఫలితాలు త్వరగా కదలవచ్చు
అవన్నీ చివర్లో ఋజువు చేసుకోవచ్చు.

ఆ ఆఖరి దినం వస్తుంది చూడు–
“డీన్ ఎలా ఉన్నాడు? ఇంకా బతికే ఉన్నాడు.
వీడ్కోలు ప్రార్థన ముగిసింది.
ఆడీ ఆడనట్లు శ్వాస. చనిపోయాడేమో”–
ఇంకా ఆఖరి గంట ముగియకమునుపే
సగం పట్టణమంతా ఆ వార్త గుప్పుమంటుంది.

"ఓ, మనమందరం చావుకు సిద్ధంగా ఉన్నామా!
అతడేం వదిలి వెళ్లాడు? ఎవరతని వారసుడు?
వచ్చిన వార్తకంటే నాకేమీ ఎక్కువ తెలీదు."
-"అతడి ఆస్తిపాస్తులన్నీ ప్రజలకే చెందుతాయట"
"ప్రజలకా! గొప్ప ఎత్తుగడ!
ప్రజలు అతడికేం చేసారు?
వట్టి పేరాశ, అసూయ, గర్వం!
అన్నీ ఇచ్చేసాడా అతడు- కాని, అతడు చనిపోయాడు.
ఈ దేశం మొత్తం మీద 'డీన్'కు లేరా
సరైన స్నేహితుడు, ఆప్తుడైన బంధువు?
ముక్కూమొహం తెలియని వాళ్లకు చేస్తాడా మంచి,
తన రక్త సంబంధీకుల్ని సొంతం మరచిపోయి?"

ఇప్పుడు పేదల వాడల్లో, పట్టణంలో వేడుకలు
సంతాపగీతాలు, సభలు, మితిమీరిన పొగడ్తలు
ప్రతి దినపత్రికలోనూ ప్రత్యేక కథనాలు
డీన్‌ను దూషించడం, డ్రాపియర్‌ను పొగడడం.

డాక్టర్లు తమ పేరు పోగొట్టుకోలేరు కదా
తప్పంతా నాదేనని తేల్చి చెప్పినారు-
-"మేం చెబుతున్నాము ఇతడిది మంచి 'కేస్' అని
అయితే, ఇతడెవరి సలహాను పాటించలేదు.
పాటించి ఉంటే ఏ ఒక్క సలహా అయినా
ఇంకో ఇరవై ఏళ్లు బతికేవాడు హాయిగా.
ఎందుకంటే, మేం కోసి చూసినపుడు లోపల
అన్ని ముఖ్య అవయవాలు ఉన్నాయి మామూలుగా"-

డబ్లిన్ నుంచి వార్త త్వరలో లండన్‌కు వ్యాపించింది.
డీన్ చనిపోయాడని సభలో ప్రకటించబడింది.

దయగల లేడీ సఫోల్క్ ఆనందంతో పగలబడి
నవ్వుతూ పరిగెత్తిందీ విషయాన్ని రాణికి చెప్పడానికి.
మహరాణి, హుందాగా, నెమ్మదిగా, స్పష్టంగా
దుఃఖిస్తూ అరిచింది– “వెళ్లిపోయాడా?”–
సరైన సమయంలోనే పోయాడు, చనిపోయాడన్నావు
కదా, కుళ్లిపోనీ; నేను వాగ్దానం చేసిన పతకాలు
మరచిపోయా, నేనిస్తానన్నాను కాని ఎప్పుడు?
అప్పట్లో నేను యువరాణిని
నేనిప్పుడు రాజుగారి భార్యను, మహరాణిని.
నీకు తెలుసు, ఎంతో తేడా ఉన్నదని అప్పటికీ, ఇప్పటికీ!

సర్ రాబర్ట్ లెవీ దగ్గర చెప్పుకుంటారు–
కాస్త హేళనగా నవ్వుతూ, అలలు ఎగిసిపడుతున్నపుడు–
–“ఏమిటీ? కాళ్లకు చెప్పులు లేకుండా చచ్చిపోయాడా?”
(బాబ్ ఏడుస్తాడు) “ఇది విషాదవార్త ఖచ్చితంగా
ఆ పనికిమాలిన వాడు ఇంకా బతికి ఉంటే
అతడి స్థానంలో నా స్నేహితుడు ఆత్మస్థైర్యాన్ని ఉంచేవాడిని.
లేదా అతడి తలపై ఓ మైటర్ టోపీ పెట్టేవాడిని
బోలింగ్ బ్రోకు చనిపోయుంటే ఒకవేళ”–

చెత్తాచెదారపు కుప్పలనుంచీ వెలికిదీసి
స్విఫ్ట్ అస్థికలున్న మూడు వాస్తవ సమాధుల్ని
లొడలొడ వాగుళ్లు, ఊకదంచుడు ఉపన్యాసాల మీదుగా
టిబ్బాల్డ్స్, మూర్, సిబ్బర్‌లు పర్యవేక్షిస్తారు.

అతడు నన్ను నాకన్నా గొప్పవాళ్లతో సమంగా చూస్తాడు
నా వీలునామా, జీవితం, ఉత్తరాలను ప్రచురిస్తాడు
చావడానికి పుట్టిన చెడుపేర్లను బతికిస్తాడు
వాటిని పోప్ భరించాలి, నేను కూడా.

ఇప్పుడు దృశ్యం మారుతుంది, నేను ప్రేమించేవాళ్లు
నా మరణానికి విచారించేవాళ్ల వేపు
పాపం, పోప్ ఓ నెల, గే ఒక వారం
అర్బత్ నాట్ ఓ దినం దుఃఖిస్తారు.

సెయింట్ జాన్ కూడా అరుదుగా భరిస్తాడు.
తన కలాన్ని కొరికి, ఒక కన్నీటిచుక్క రాలుస్తాడు.
మిగతా జనం ఓసారి భుజాలెగరేసి ఏడుస్తారు.
నాకూ విచారమే; మనమందరం చనిపోతామని.
జ్ఞానపు మారువేషంలో ఉంటుంది నిర్లిప్తత,
ఇష్టాలను తట్టుకునే స్థైర్యాన్ని ఇస్తుంది మనసు.
ఎలా రాతి పాత్రలు కరుగుతాయి
కనీసపు జాలినైన తలచని వాటికి?
కొరడా దెబ్బలు మనకి తగిల్తే, అవి శిలువను
ముద్దాడుతాయి, దైవేచ్ఛకు వాటిని వదిలేస్తాయి.

నాకన్నా ఒక ఏడాది చిన్నవాళ్లు, భయంతో
సందిగ్ధతతో హింసించబడుతున్నారా మూర్ఖులు?
వాళ్లు నా వయసును తెరగా భావించినారు
మృత్యువు నావేపు వస్తే మధ్య నిలబడతారు
తెరను లాగేస్తుంది మృత్యువు, వణుకుతున్న హృదయాలతో
వారు విడిపోకుండా నాకోసం దుఃఖిస్తారు.

నా ఆడ స్నేహితులు, వారి సున్నిత హృదయాలు
వాటి వాటి పాఠాలను అప్పజెప్పడం నేర్చుకున్నాయి.
ఈ వార్తను శోకతప్త హృదయాలతో వింటాయి.
–"డీన్ మరణించాడు (ట్రంప్స్ అంటే ఏమిటి?)
దేవుడు అతడిపై కరుణను కురిపించును గాక!
గౌరవనీయులైన మహిళలారా! ఎలుకలా ప్రయత్నిస్తాను నేను
ఆరుగురు డీన్లు కావాలి పాడె మోయడానికి

(రాజు ఏమి అడుగుతాడో నాకు తెలిస్తే బాగుండును)
మేడమ్, నీ భర్త తన మంచి స్నేహితుడి
అంత్యక్రియలకు హాజరవుతాడా!
లేదు మేడమ్, అది అతడు చూడలేడు
అయినా, రేపు రాత్రి అతడు వేరే పనిలో ఉన్నాడు.
మా మహిళా సంఘం మంచిగా అనుకోదు
నాతోపాటు రేపు క్వాడ్రిల్లి వేడుకకు రాకపోతే!
అతడికి 'డీన్' అంటే యిష్టం (మంచి హృదయం)
అయినా, ప్రాణస్నేహితులైనా తప్పదు కదా విడిపోవడం.
అతడి కాలం ముగిసింది, అతడి పరుగు పూర్తయ్యింది
అతడికి మంచి స్థానం లభిస్తుందని ఆశిద్దాం"–

స్నేహితులు చనిపోతే మనమెందుకు దుఃఖిస్తాం?
నష్టమేమీ లేదు, దొరకడం సులభమే!

ఓ సంవత్సరం గడిచాక, ఈసారి దృశ్యం మారుతుంది.
డీన్ గురించి పట్టించుకునేవాళ్లే ఉండరు.
అతడిప్పుడు పొగమంచుకన్నా తక్కువ
ఎప్పుడూ ఈ లోకంలేనే అసలు లేనట్లు

'అపోలో' కు ఇష్టుడు ఎక్కడ ఉన్నాడిప్పుడు?
వెళ్లిపోయాడు. అతడి పనులూ అనుసరిస్తాయతడిని.
అవన్నీ మామూలుగానే మాసిపోతాయి.
అతడి హాస్య చతురత ఈ కాలానికి సరిపోదు.
ఓ పల్లెటూరి కవి అటుగా పోతున్నాడు
స్విఫ్ట్ గురించివచనంలో, పద్యంలో అడుగుతాడు
వింటాట్ అంటాడు– "ఈ పేరు నేను విన్నాను,
ఏడాది క్రితం ఇతడు చచ్చిపోయాడు."
తన దుకాణమంతా వెదుకుతాడతడు – స్విఫ్ట్ రచనల కోసం.
వెదికి అంటాడు– "బాతులబజార్లో దొరకవచ్చు"–

ఓ బండి నిండా పుస్తకాలు పంపాను క్రితం సోమవారం
పేస్ట్రీలు వండేవాళ్లకు అవి వంట చెరకు
ఒక సంవత్సరం అలా ఉండడమే ఆశ్చర్యం ఆ సరుకు!
నీవిక్కడకు కొత్తవాడిలా ఉన్నావు.
డీన్ తన కాలంలో ప్రఖ్యాతుడే.
అతడు యతి ప్రాసలలో నిష్ణాతుడే.
ఆ రచనా విధానం ఇప్పుడెవరూ ఇష్టపడరు.
ఈ పట్టణానికి మెరుగైన అభిరుచి ఉంది.
నా దగ్గర పాత పుస్తకాలు ఉంచను
కొత్తవి, తళతళలాడేవి చాలా ఉన్నాయి.
తమరు అనుమతిస్తే అవి చూపిస్తాను.
ఇది 'కోలీ సిబ్బర్' వ్రాసిన పుట్టినరోజు గేయం.
ఈ పాటను మీరెప్పుడూ చూసి, విని ఉండరు.
మహారాణి మీద 'స్టిఫెన్ డక్' వ్రాసాడిది.
తన స్నేహితుడు, కళాకారుడైన స్నేహితుడిని
విమర్శిస్తూ వ్రాసిన చక్కని వ్యాసమిది.
ఇది చెబుతుంది మతబోధకులపై
అతడికున్న కోపం, ప్రేమ లేకపోవడం.

ఇది సర్ రాబర్ట్ వ్రాసిన నిర్దోషిత్వం
ఇది మిస్టర్ హెన్లీ ఆఖరి వక్తృత్వపాఠం,
ఇంకా ఇది పుస్తకాల దేగల చేతుల్లో పడలేదు.
తమలాంటివారు ఒక డజనుకొంటే గౌరవం.
ఇది వోల్స్టన్ 'ట్రాక్ట్స్' పన్నెండో ముద్రణ
ప్రతి రాజకీయవేత్తకు పెద్దబాలశిక్ష, రక్షణ.
పల్లెటూరి ప్రముఖులు నగరానికి వచ్చినపుడు
వాళ్లను వాళ్ల గ్రామాలకు పంపడానికి
నీవెప్పుడూ అంత తెలివిగల పని చూసి ఉండవు
సభికులు వాళ్ల హృదయాల్ని పట్టి లాగేస్తారు.

ఈ గౌరవనీయులైన పెద్దలు (వీళ్లకు చదువురాదు)
వాళ్ల గుంపుకు మేలు చేసేందుకు వీళ్లను వాడుకుంటారు.
గౌరవింపదగిన రచయిత మంచి అభిప్రాయాలకు
కాస్త ఫింఛను సొమ్ము బహుకరించబడ్తుంది.
అతడు తన అంగీకి న్యాయం చేస్తాడు,
పూజారుల విధానాల్ని ఎండగట్టేలా సాహసిస్తాడు.
–దేవుడు గ్లాసెస్టర్‌లో ఉన్నట్లు
జీసస్ గొప్ప మోసగాడన్నట్లు
అతడి అద్భుతాలన్నీ వంచనలనీ
ఆ మాత్రం ఇంద్రజాలం మంత్రగాళ్లు చేస్తారనీ–
చర్చికి అంతమాత్రం వ్రాయగల రచయిత ఉంటే
అతడి నెత్తికి మైటర్–టోపీ తొడిగేవారు.

నేను చనిపోయాననుకుందాం,
రోజ్–గులాబీతోటలో సమావేశం జరుగుతుందప్పుడు
కాసేపు పిచ్చాపాటీ, నేనూ చేసాను వాళ్లకు సాయం.
నాపేరు చర్చలోకి వచ్చింది, కొందరు అనుకూలంగా
కొందరు ప్రతికూలంగా, ఒకాయన నిర్లిప్తంగా
నా వ్యక్తిత్వంపై సమగ్రమైన అభిప్రాయం.
–"మనకు లభించిన సాక్ష్యాధారాలను చూస్తే
డీన్‌కు సభలో లభించింది సముచిత గౌరవం.
అతడి రచనలు పద్య వచన పద్ధతులకు సమాదరం,
నేను వీటికి న్యాయనిర్ణేతను కాబోను
విమర్శకులు ఏమన్నారో నేను చెప్పబోను
నేను చెప్పగలిగిందొక్కటే, నాకు తెలిసిన విషయం
ఈ పుస్తకాలు అందరూ కొన్నారు.
వాటిలో నైతిక విలువలున్నాయి గనుక
మానవజాతి దురలవాట్లకు విరుగుడు వ్రాసినాడు గనుక

అతడి శైలి వ్యంగ్యం, అధిక్షేపణ
మూర్ఖుడిని బహిర్గత పరుస్తుంది, మోసగాడిని కొరడాదెబ్బలు కొడ్తుంది.
అతడు ఎవరి దగ్గరా కాపీ కొట్టలేదు. అనుకరించలేదు.
అతడు వ్రాసిందంతా అతడి స్వంతమే.

తనకు గౌరవ మర్యాదలు దక్కాలని ఆశించలేదు.
ఒక ప్రభువు అతడిని స్వయంగా ఆదరించాలనుకున్నాడు.
అయినా, అతడు దొరకకుండా స్వంత దారి వెదుక్కున్నాడు
బురద చెప్పులేసుకుని హాస్యంగా మాట్లాడేవాడు
చుక్కలు, భుజకీర్తులున్న తెలివి తక్కువ వాళ్లను వ్యతిరేకించాడు.
న్యాయాన్ని, ధర్మాన్ని అనుసరించినాడు
గుంపును పోగేసి చర్చలు పెట్టలేదు
పదిమందినీ గొప్పగా పొగడలేదు
ఎవరి గొప్పతనాన్ని చూసి భయపడలేదు
ఎందుకంటే ఎవరి సాయమూ అపేక్షించలేదు.

“గొప్ప గొప్ప విషయాల్లో ఇతడిని నమ్మారని
తనేదో గొప్పవాడిలా ప్రవర్తించలేదు.
స్వలాభం గురించి గంగవెర్రులెత్తకుండా
తనకున్నదంతా మిత్రులకు సాయం చేసినాడు.
మంచిది, ఉపయోగపడ్తుంది పదిమందికీ అనుకున్నదే ఎన్నుకున్నాడు
వందిమాగధులను, రక్త సంబంధీకులను దూరంగా ఉంచినాడు.

ఆపదలో ఉన్న గుణవంతులను ఆదుకున్నాడు
మంచి విజయాలు ఎక్కువసార్లు పొందినాడు
అతడి సాయమే లేకుంటే చాలామంది
అనామకులుగా మిగిలిపోయేవారు.

రాజకుమారులతో మర్యాదలు పాటించేవాడు
అంతేకాని విభ్రమంగా నిల్చుండిపోయేవాడు కాదు

డేవిడ్ పాఠాన్ని చక్కగా అనుసరించినాడు
వాళ్లమీద తన నమ్మకాన్ని ఉంచలేదు
ఎవరైనా తనను బాధపెడ్తే,
అధికారంలో ఉన్న బానిసతో అవమానించ చూస్తే
ఐరిష్ సెనేట్ మాటవరుసకి, అతడు
ఎంతో అసహనంతో ప్రతిస్పందించాడు.
సరైన స్వేచ్ఛ, స్వాతంత్రం అతడి పిలుపు
దానికోసం మరణించడానికైనా సిద్ధపడినాడు
దానికోసం ఒంటరి పోరాటం చేసినాడు
దానికోసం తనని తాను బహిరంగ పరచుకున్నాడు.
రెండు రాజ్యాలు గుంపులుగా మారినపుడు
అతడి తలకు వెల ప్రకటించినపుడు
ఒక్క ద్రోహీ కనిపించలేదు
అతడిని అమ్మి ఆరువందల పౌండ్లు పొందేందుకు.

అతడు గనుక తన నాలుకను, కలాన్ని విడిచిపెట్టి ఉంటే
ఇతరుల్లా ఉన్నత స్థానాల్ని పొందేవాడు
అయితే, అధికారం అతడి లక్ష్యం కాదు
ధనాన్ని చిల్లపెంకులతో సమానంగా చూసాడు
ఎన్నోసార్లు కృతఘ్నతను ఎదుర్కొన్నాడు.
గాయపరచినవాళ్లపై జాలిపడినాడు.
తన మనసులో ఉన్నదొకే లక్ష్యం
అది మానవజాతి సంక్షేమం.

తన శత్రువులను సంతోషపెట్టాలని తాను నమ్మిన
సత్యాలనెన్నడూ త్యాగం చేయలేదు.
ఫలితం దక్కనున్నా అవిశ్రాంతంగా పనిచేసి
అధికారంలో ఉన్న తన స్నేహితులతో శాంతి కోరినాడు.
ఒక పక్షం సమస్యలను సృష్టించడం చూసాడు
వాళ్లు ఒకరినొకరు నాశనం చేసుకోవడం గమనించాడు.

ఎక్కడ చూసినా ఆడంబరం, పటాటోపాలని
నిరాశతో కోర్టు నుంచి వెడలిపోయినాడు.

“ఈ మానవ పథకాలెంత అల్పమైనవో చూడు
మన బంగరు కలలన్నీ ఇక్కడే కరిగిపోయినాయి.
సెయింట్ జాన్ రాజనీతి నైపుణ్యం,
ఆర్మాండ్ శౌర్యం, ఆక్స్‌ఫర్డ్ రక్షణ
తమ దేశాన్ని రక్షించుకోవాలనే తాపత్రయం
ఇవన్నీ అంతమయ్యాయి ఒకే ఒక్క సంఘటనతో.
ఆ విలువైన ప్రాణం పోగానే, ఎవరిపైన
మన విలువలన్నీ ఆధారపడడి ఉన్నాయో,
ఇప్పుడు గుంపు తగాదాలు మొదలవుతాయి–
ఆగ్రహం, ప్రతీకారం నిండిన హృదయాలు
ఇప్పటి వరకు ఒకే గుంపుగా, ఒప్పందానికి బద్ధులై ఉన్నవారు
విడిపోయి ఒకరినొకరు నాశనం చేస్తారు, చంపుకుంటారు
మతాన్ని ఒక కట్టుకథగా, ప్రభుత్వాన్ని బాబెల్ గందరగోళంగా మారుస్తారు.

న్యాయాన్ని తిరగరాస్తారు. ఆ దుస్తులకు తలవంపులు తెస్తారు.
సభికుల్ని ప్రలోభపెడ్తారు, కిరీటాన్ని దోచుకుంటారు.
ఇంగ్లాండు కీర్తికి కళంకం తెస్తారు.
చరిత్ర కథనంలో ఆమెకు చెడ్డపేరు తెస్తారు.
అటువంటి తుఫాను ఈ నేలను కుదిపేస్తుంటే

ఏ రక్షణా లేని గుణశీలాలెక్కడ నిలబడగలవు?
భయంతో, భీతితో, దుఃఖంతో, నిరాశతో
డీన్ చూసినాడు ఈ విధ్వంసకర దృశ్యాన్ని
అతడి స్నేహితులు ప్రవాసంలో, లండన్ టవర్‌లో
తాను స్వయంగా అధికారపు ఆగ్రహజ్వాలలలో
విషం గక్కే కలాలు అతడిని వెంటాడుతుంటే
బానిసల రాజ్యంలోకో, బాడవ భూముల్లోకో పోయినట్లు

సేవకుల జాతి దోషాల్లో పెంచబడినప్పుడు
నీచంగా చూడబడగా ఎదురు తిరిగినట్లు-

అమాయకత్వం, పట్టుదలతో అతడు
కఠిన నిర్బంధాల నెదుర్కున్నాడు అవిరామంగా.
ముందుకెళ్లే అవకాశాలు వచ్చినా
అతడి మంచి లక్షణాలే అవరోధాలైనాయి.
అతడి ముఖ్య స్నేహితులనుకున్నవారే
వారివారి స్వంత లాభాలకై అతడిని వదిలివేసినారు.
ఒక తిరుగుబాటుదారుడిగా అతడిని భావించి
అతడికి వ్యతిరేకంగా తలలెత్తినారు.

డీన్ తన కలంతో మట్టికరిపించాడు.
ఒక అప్రఖ్యాత విధ్వంసకర వంచకుడిని.
మూర్ఖులకు తమ తప్పులను తెలిసే పద్ధతులు నేర్పినాడు.
దెబ్బలు కాచుకోడానికి ఆయుధాలనిచ్చినాడు.
అసూయ దానిని కైవసం చేసుకుని అతడిని దెబ్బతీసింది.
అసహాయ స్థితిలో ఉన్న దేశాన్ని శిథిలం కాకుండా కాపాడే యత్నాలు
ఎవరైతే చక్రం తిప్పుతున్నారో వాళ్లకవి నచ్చలేదు
వాళ్ల లాభాలకి అడ్డువస్తున్నాడని రక్తం కళ్లజూసారు.

వాళ్లని దురదృష్టకరమైన విధికి, అంతిమ నాశనానికి
వదిలేయకుండా, రక్షించే ప్రయత్నం చేసినందుకు
అతడిపై రాజద్రోహ నేరం ఆరోపించబడింది.
బెంచిపై కూర్చున్న ఓ మోసకారి మృగం
ఎన్నటికీ తీరని రక్తదాహమున్నది దానికి,
క్రూర రాక్షస మనస్తత్వంతో వినాశపూరితమైన 'విలన్'
నవీన స్క్రాగ్స్, పాత ట్రెస్సి లియూన్‌లా
న్యాయధర్మాలను విడిచిపెట్టినది
దేవుడంటే భయం లేనిది, మనుష్యులను లెక్కచేయనిది,

డీన్ మీద పగతీర్చుకోదలిచింది.
అతడి జీవశక్తిపై దెబ్బకొట్టదలుచుకున్నది.
అయినా, స్వర్గం అతడి అమాయకత్వాన్ని మెచ్చుకున్నది
కృతజ్ఞతతో స్నేహితులెందరో అతడి పక్షాన నిలిచినారు.
న్యాయ నిర్బంధాలు లేవు, న్యాయమూర్తులు కోపించలేదు
కిరీటాన్ని పొగిడే విషయాలు చర్చకు రాలేదు.
సాక్షులు కొనబడలేదు, జ్యూరీని పిలువలేదు.
అతడిని శిక్షించేందుకు ఏ చర్యా తీసుకోబడలేదు.

ప్రవాసంలో, నిబద్ధతా హృదయంతో
తన శేషజీవితాన్ని గడిపాడతడు,
ఎక్కడ తప్పులు, గర్వం, గుంపు విభజనలు రాజ్యం చేస్తాయో
సెయింట్ జాన్, పోప్, గేలు కడు దూరంగా ఉంటారో అక్కడ.

అక్కడ అతడు చాలా తక్కువమందితో చేసాడు స్నేహం.
వాళ్లందరూ కాస్త నెమ్మదైన వాళ్లు
హోదాలు లేవు, హుందాగా ప్రవర్తిస్తారు.
ప్రభువులకుండాల్సిన లక్షణాలు
అక్కడ బిరుదులు ఇవ్వవు, పరిపాలనాధికారాలూ, హక్కులూ–
ప్రభు వర్గమనేది వాడిపోయిన పుష్పం
అతడికి అది అవమానంతో సమానం
ఎవడైనా మూర్ఖుడికి అతడి ముఖం తెలిస్తే
రాజ్యానికి శాపమైన పల్లెటూరి ప్రభువులు–
అతడు తన ఆగ్రహాన్ని వాళ్లపై వెలిబుచ్చినాడు అనేకమార్లు వృథాగా!

రెండేళ్లకోసారి సంతకు వచ్చినట్లు వచ్చి
ఆత్మలను, వోటును సున్నాకు అమ్మి పోతారు
దేశం ఆనందోత్సాహాలను ప్రకటిస్తుంది.
చర్చి దోచబడి దాని కిరాయిదారులు హింసించబడతారు.
దొంగలతో, దోపిడీగాళ్లతో విందులు గుడుస్తారు.

శాంతి పరిరక్షణకు, శుల్కం వసూలు చేస్తారు
ప్రతి ఉద్యోగానికి ఒక వెల,
జైలో లేక సైనిక స్థావరమో మరమ్మత్తులో
ప్రజలకు, రహదారులకు కేటాయించబడిన సొమ్ముతో
స్వంత భవనాలు కట్టుకుని సంతోషపడతారు.

నేనంటాను, డీన్ తన కలంలో చాలా ఎక్కువ
వ్యంగ్యాన్ని, కారాన్ని కలిపాడని,
దానినతడు మార్చదలుచుకోలేదు
ఇంతకు మించిన దురదృష్టకాలమింకెప్పుడున్నది?
ఒకరిని ఎగతాళి చేయడం అతడి ధోరణి కాదు.
అతడు వ్యసనాన్ని తిట్టినాడు, వ్యక్తులను పేర్కొనలేదు.
ఎవరూ బాధపడనక్కరలేదు
అది వేలాదిమంది నుద్దేశించినది.
అతడి వ్యంగ్యం ఒక దోషాన్ని వేలెత్తి చూపడం కాదు
అందరూ సరిదిద్దుకోగలిగిన దానివేపు
అతడు అజ్ఞానాన్ని వ్యతిరేకించినాడు
తగిలినవాళ్లు దానిని ఎగతాళిగా తేలికపాటి హాస్యంగా భావించినారు.
అతడు గూనివాళ్లను, ముక్కు వంకరవాళ్లను గేలిచేయలేదు.
వాళ్లను, అనాకారితనాన్ని ప్రదర్శనకు పెట్టలేదు.
నిజమైన కష్టాలు, బాధలు అతడిని కదిలించాయి.
హాస్యం కోసమైతే అతడు దానిని పట్టించుకోలేదు.
ఎవరైతే తమ అజ్ఞానాన్ని ప్రవర్తించినారో
వారికి వ్యంగ్యంగా సమాధానమిచ్చినాడు.
వారినతడు హేళన చేయలేదు.
ఎవరైనా తెలివితక్కువ ప్రశ్న వేస్తే నవ్వేవాడు.
కంఠతా పట్టిన హొరేస్ కవితనో చెప్పేవాడు.

“అతడికి వంద చక్కని కథలు తెలుసు.
విగ్స్, టోరీల రకరకాల కథనాలు, మార్పులు చేర్పులు

అవన్నీ అతడిని కడపటి వరకు ఆనందపరచినాయి.
అతడి స్నేహితులతడిని అతడి దారిలోనే వెళ్లనిచ్చినారు.

తనకున్న కొద్దిపాటి సంపదలతో ఓ ఇల్లు కట్టి
మూర్ఖులకు, పిచ్చివాళ్లకు ఆశ్రయమిచ్చినాడు.
కాస్త వ్యంగ్యంతో నిండిన ఆ ఇంటిలో ఉండడానికి
ఏ దేశమూ కాసింత ఉత్సుకత చూపించలేదు.

అతడు తన ఋణదాతకు వదిలివెళ్లిన సామ్రాజ్యం
ఇంకా గొప్పదవుతుందని నా అచంచల విశ్వాసం.

✧✧✧✧✧

---

మరణానంతర జీవితం గురించిన చర్చ అనాదికాలం నుంచీ ఉన్నదే. అనేక ఊహలు, సిద్ధాంతాలు, ప్రకృతిని శోధించడాలు, సమాధానాలకై పరితపించడాలూ ఇది అన్ని నాగరికతలలోనూ ప్రముఖ స్థానాన్ని పొందినాయి. డాంటే ఒక అద్భుత కావ్యాన్ని వ్రాసినాడు (The Divine Comedy) ఈ అంశంపై.

జోనాథన్ స్విఫ్ట్ (30-11-1667 - 19-10-1745) ఆంగ్లో-ఐరిష్ వ్యంగ్య రచయిత, కవి, వ్యాసకర్త, లేఖకుడు, డీన్ ఆఫ్ సెయింట్ పాట్రిక్ కాథెడ్రల్ - డబ్లిన్.

గలివర్స్ ట్రావెల్స్, A modest proposed, The battle of the Books, A Journal to Stella, A Tale of a Tub Drapiers Letters లాంటి రచనలతో ఇంగ్లీషు భాషలో వ్యంగ్య రచనలకు అగ్రగణ్యుడిగా Encyclopedia Britannicaలో పేర్కొనబడినాడు.

డ్రాపియర్ అనే మారుపేరుతో వ్రాసిన ఈ వ్యంగ్య లేఖాస్త్రాలు మూడు, నాల్గింటిలో ఈ Verses on the Death of Dr. Swift D.S.P.D. ఓ అద్భుతమైన దీర్ఘ కవిత.

M.B. Drapier అనే పేరుతో వ్రాసిన ఉత్తరాలు ఐరిష్ ప్రజల స్వాతంత్ర్యాభిలాషను తెలుపుతాయి. 1724-1725 ప్రాంతంలో రాగి నాణేలను ముద్రించడానికి ప్రైవేటు వ్యక్తులకు (William Wood) అనుమతి ఇవ్వబడగా వాటిలో నాణ్యత లేదని భావిస్తూ స్విఫ్ట్ ఈ లేఖలు డ్రాపియర్ పేరు మీద వ్రాసినాడు.

బ్రిటిష్ ప్రభుత్వపు తోడ్పాటుతో, ఐరిష్ ప్రభుత్వం ఈ లేఖలను ఖండించింది. అయితే ప్రజల ఆగ్రహం దేశమంతా వ్యాపించగా ప్రైవేటు వ్యక్తుల కిచ్చిన అనుమతి రద్దు చేయబడింది. ఐర్లాండ్ ప్రజలు 'స్విఫ్ట్'ను 'హీరో'గా అభిమానించినారు.

గలివర్ యాత్రలు (Gulliver's Travels (1726) లో వెలువడి అచిర కాలంలోనే ఆబాల గోపాలపు మన్ననలనందుకున్నది.

ఇంత గొడవ జరిగిన Wood's రాగి నాణేలు నాణ్యమైనవిగా నిర్ధారించబడినా విలియం వుడ్ మొదటి జేమ్స్ ప్రభువు ప్రియురాలు Duchess of Kendall కు పదివేల పౌండ్లను బహుమతిగా ఇచ్చి (అది ఈనాటి 1405000 పౌండ్లకు సమానం) అనుమతి పొందాడు అన్నది బయటకు పొక్కి చివరకు అప్పటి ప్రధానమంత్రి రాబర్ట్ వాల్‌పోల్‌కు ఐర్లాండ్ నేతలకు మధ్య తగాదాగా రూపుదాల్చుకున్నది. ఐర్లాండ్ చర్చి ఆ రాగి నాణేల విడుదలను వ్యతిరేకించినా ఫలితం లేకపోయింది. టోరీలు (Queen Anne), విగ్గులు (వాల్‌పోల్) మధ్య టోరీ పక్షాన్ని వహించి Drapier (Draper - నిజాయితీ గల వస్త్ర వ్యాపారస్తుడు) అనే పేరుతో వ్రాసిన ఈ లేఖలు ఐరిష్ ఉద్యమానికి ప్రాణం పోసినాయి. అలా ప్రజలచే The Darling of the Populace గా కీర్తించబడినాడు Jonathan Swift.

# 6. అలెగ్జాండర్ పోప్

## (Alexander Pope 1688-1744)

## శిరోజాల మానభంగం

## (The Rape of the Lock)

బెలిందా, నీ శిరోజాలను అపవిత్రం చేయడం లేదు నేను,
నీ ప్రార్థనలు నాకిచ్చిన అవకాశాన్ని వినియోగిస్తున్నాను.

Nalueram, Belinda, tvos violare capillos; Sed
Juvat hoe precibus me tribusse Tvis

I will not, Belinda, to violate your hair; But this
is my choce for your prayers have given me.

## 1. బెలిందా నిద్రలేచి అలంకరించుకోవడం

ప్రేమ కారణంగా ఎటువంటి కయ్యాలు జనిస్తాయో,
స్వల్ప విషయాల నుంచి ఎటువంటి పోట్లాటలు పుడతాయో,
నేను గానం చేస్తాను- ఈ గేయం 'కారిల్' కోసం; మ్యూజ్!
దీనిని బెలిందా సైతం చూసి నిర్ధారించనీ,
అంశం స్వల్పమైనదే, కాని, పొగడ్త కాదు.
మ్యూజ్! నీవు నన్ను ప్రోత్సహిస్తే, కారిల్ నా కవితను అంగీకరిస్తాడు.

ఎటువంటి వింత ఉద్దేశమో చూడు, దేవతా! గౌరవనీయుడు
చక్కగా పెంచబడిన ప్రభువు సుతిమెత్తని కన్యపై దాడిచేయడం!
ఓహ్, చెప్పు, ఏ వింత కారణం వలన, ఇంకా శోధించబడనిది,
ఆ అందాల కన్య ప్రభువును ఎదిరించడం?
అటువంటి వీరోచితమైన కార్యాలు, అల్పులు చేయగలరా?
మెత్తని హృదయాలలో అంత పగ, కోపాగ్ని దాగుంటాయా?

సూర్యుడు తెల్లని తెరల గుండా పంపినాడొక బిక్కుబిక్కుమంటున్న కిరణాన్ని,
పగటికి గ్రహణం పట్టించే ఆమె కనులను తెరచినాడు.
పెంపుడు కుక్కలు నిద్రలేచాయి వళ్లు విరుచుకుంటూ.
నిద్రలేని ప్రేమికులు సరిగా పన్నెండింటికి నిద్రలేచారు.
మూడుసార్లు గంట మోగాక, స్లిప్పరు నేలకు తగిలింది.
నొక్కబడిన గడియారం వెండి ధ్వనిని వినిపించింది.
'బెలిందా' దిండును మరింత నొక్కుకున్నది తన ముఖానికి
ఆమె రక్షక దేవత విశ్రాంతి కాలాన్ని పొడిగించినాడు.

ఆమె మౌనపు శయ్య వద్దకు అతడు రప్పింపబడినాడు
వేకువ స్వల్పమై ఆమె శిరసుపై కదలాడినాడు.
పుట్టినరాత్రి సొగసు కన్నా మెరిసే అందగాడా యువకుడు.
(నిద్రలో కూడా ఆమె బుగ్గలపై గులాబీలు పూయించినవాడు)
ఆమె చెవుల దగ్గర అతడి విజయాధరాల నుంచినట్లు,
గుసగుసలుగా ఏదో చెప్పినట్లు, లేదా, చెబుతున్నట్లు,
మర్త్యులలో అందగాడా, వేయి ప్రకాశవంతమైన
వాయు నివాసుల రక్షణ చూసేవాడా!
నీ శిశు ఆలోచనను ఒక్క దర్శనమైనా స్పృశించిందా?
నర్సులు కాని, పూజారులు కాని ఎవరైనా చెప్పారా,
గాలిలోని చిరుభూతాలు వెన్నెల నీడలలో కనిపిస్తారని
వెండి ముద్రలతో, హరిత వలయాలలో
కన్యలను దర్శించే దేవతాశక్తులు
స్వర్ణ కిరీటధారులై, స్వర్గలోక పుష్పమాలాంకృతులై వస్తారని?
విను నమ్ము! నీ ప్రాముఖ్యాన్ని తెలుసుకో!
దిగువ లోకం గురించి ఉన్న సంకుచిత భావాలు నమ్మకు.
గర్వించే జ్ఞానులకు తెలియకుండా కొన్ని రహస్య సత్యాలు దాచిపెట్టబడినాయి.
అవి కన్యలకు, పసిపిల్లలకు చెప్పబడతాయి.
ఉపయోగం లేని సందేహపు హాస్యాలేం చెబుతాయి?
అందమైన వాళ్లు, అమాయకులు ఇంకా నమ్ముతారు.

అందుకని తెలుసుకో, అసంఖ్యాక ఆత్మలు నీ చుట్టూ ఎగురుతాయి.
దిగువ ఆకాశంలోని తేలికపాటి వాయుసేన అది.
వాళ్లు కనిపించరు కాని ఎగుర్తారు రెక్కలపై
పెట్టెలపై వేళ్లాడతారు, ఉంగరం చుట్టూ పరిభ్రమిస్తారు
ఆలోచించు నీకెటువంటి పరివారముందో గాలిలో
కనుక, తిరస్కారంతో చూడు ఇద్దరు సేవకులు, ఒక కుర్చీని.

నీ పద్ధతులు నీవి, మావి పాతకాలపు వ్యవహారాలు.
ఒక్కసారి స్త్రీల సౌందర్యపు బూజులో చిక్కుబడ్డాక
కాస్త రూపు మార్చుకుని నేలమీది రూపాల్లోంచి
ఇలా గాలిలోకి తేలిపోతాం.
ఏమనుకోకు, స్త్రీ తాత్కాలిక ఊపిరి ఎగిరిపోయిందా
ఆమె ఆడంబరాలన్నీ చచ్చిపోతాయి ఒకేసారి.
రాబోయే గౌరవాలపై ఆమెకుంటుంది నమ్మకం
ఆమె ఇంకా ఆడకపోయినా, పట్టించుకోదు ముక్కల్ని.
బతికున్నపుడు ఆమె ఆనందమంతా మెరిసే రథాలపై,
ఓంబర్ పేకాటపై ప్రేమ మరణించాక కూడ మిగుల్తుంది.
వాళ్ల గర్వంలోని చక్కదనమంతా ఆవిరయ్యాక
వాళ్ల ఆత్మలు మళ్లుతాయి తొలి మూలకాల్లోకి.
మండిపడే జగడగొండి దేవతల ఉల్లాసపు ఆత్మలు
మంటల్లో పైకెగసి తీసుకుంటాయి 'సాలమాండర్' పేరును.
నీటికోసం లొంగిపోయే మెత్తటి మనసులు జారుకుంటాయి
జలకన్యలతో కలిసి మూలకాల తేనీరు సేవిస్తాయి.
శృంగారమంటే గిట్టనివాళ్లు మరుగుజ్జు భూతాలై
చిల్లర పనులు చేస్తూ భూమిపై అల్లరి చేస్తుంటారు.
వగలమారి భూతాలు మరులు కురిపిస్తూ
గాలి మైదానాల్లో ఆటలాడుతూ హొయల్లు పోతుంటారు.

ఇంకా లోతుగా తెలుసుకోవాలనుకుంటున్నావా,
అందంగా ఉండే శీలవంతులు మానవజాతిని తిరస్కరిస్తారు.

వాళ్లని కౌగిలించుకుంటాయి చిలిపి భూతాలు.
మర్త్య న్యాయాల నుంచి విడివడిన ఆత్మలు
వాటికి కావాల్సినట్టు ధరిస్తాయి స్త్రీపురుష రూపాలు
కరిగిపోయే కన్యల స్వచ్ఛతను కాపాడేదెవరు?
పల్లెటూరి నృత్యాలలో, అర్ధరాత్రి దాగుడుమూతలలో
వంచకుడైన స్నేహితుడి నుంచి జ్వాలలా కాపాడేదెవరు?
పగలు చూస్తారు, చీకటి రాత్రి గుసగుసలు పోతారు
మంచి సందర్భం వాళ్ల వేడి కోరికలను ప్రోత్సహిస్తే
సంగీతం సమ్మోహనమై, నృత్యాలు జ్వాలలైతే కాపాడేదెవరు?
అది వాళ్ల రక్షక దేవతలైన వాయుభూతాలకు తెలుసు.
దిగువనున్న మనుషులకది పరువూ, గౌరవం.

కొందరు కన్యలకు, వదన సౌందర్యంపై మక్కువ
వాళ్ల జీవితాలు ముందే నిర్ణయించబడినాయి పొట్టిభూతాల కౌగిళ్లకు
అవి వారి అవకాశాలను పెంచుతాయి, గర్వాన్ని హెచ్చిస్తాయి.
ఎప్పుడైతే నివేదన తృణీకరించబడి, ప్రేమ తిరస్కరించబడిందో
వాళ్ల ఖాళీ మెదడును హుషారు ఆలోచనలు చుట్టుముట్టుతాయి.
ఈలోగా చక్రవర్తులు, ప్రభువులు వాళ్ల పరివారాలు,
భుజకీర్తులు, నక్షత్రాలు, కిరీటాలు దర్శనమిస్తాయి.
శ్రావ్యమైన ధ్వనుల్తో నీ కరుణ వాళ్ల వీనుల్ని పలకరిస్తుంది.
–“ఇది తొలుదొల్త స్త్రీల ఆత్మలకు కళంకాన్ని తెస్తాయి.
యవ్వనంతో ఉన్న జవ్వనుల కళ్లు మిలమిలలాడ్తాయి.
పసిపిల్లల బుగ్గలపై సిగ్గుల మెరుపుల్ని నేర్పుతాయి.
సొగసుగాడిని చూసి చిన్ని హృదయాలు రెపరెపలాడ్తాయి”

లోకం ఎప్పుడైతే స్త్రీలు తిరుగుబోతులని ఊహిస్తుందో
ఈ దివ్యాత్మా భూతాలు ఇంద్రజాలాల్తో దారులనేర్పరుస్తాయి.
కళ్లు తిరిగే వలయాలలో వెంటబడతాయి.
పాత అసంగతాలను కొత్తవి నెట్టివేస్తాయి.

ఏ సున్నితమైన కన్య చిక్కుల్లో బలిపశువౌతుంది,
ఒక మగాడి ప్రేమకు, మరో అతడి కోపానికి?
ఫ్లోరియో మాట్లాడ్తుంటే ఏ కన్య తట్టుకోగలదు,
డామన్ మృదువుగా ఆమె చేతిని నొక్కకపోతే?
వివిధ రకాల ఆడంబరాలతో, ప్రతిచోటు నుంచీ
వాళ్లు తమ హృదయపు ఆటవస్తువుల దుకాణాన్ని మారుస్తుంటారు
విగ్స్, విగ్స్‌తో, స్వోర్డ్‌నాట్లు స్వోర్డ్‌నాట్లతో పెనగులాడుతారు.
సొగసుకాడు సొగసుగాళ్లను బహిష్కరించగా
శిక్షకులు శిక్షకుల్ని శిక్షిస్తారు.
తప్పులు చేసే మర్త్యుల్ని అల్పత్వం పిలుస్తుంది.
సత్యం కానలేని భూతాలు ఈ కుట్రలు పన్నుతాయి.

వీళ్లలో మిమ్మల్ని కాపాడే రక్షక భూతాన్ని నేను,
నా పేరు 'ఏరియల్'. నేను గాలిలోని స్ఫటిక గోళాల్లో,
మీ పాలక నక్షత్రపు అద్దంలో మిమ్మల్ని స్పష్టంగా చూసాను.
–"అయ్యో! ఏదో భయంకర సంఘటన జరగబోతోంది
ఇక్కడ ఉదయసూర్యుడు దిగివస్తున్నాడు
స్వర్గం తెలియజెప్పడం లేదు ఏమిటి, ఎలా, ఎక్కడ?
వాయుభూతాలు చెబుతున్నాయి, నీతిమంతురాలైన కన్యా, జాగ్రత్త, బహుపరాక్!
నీ రక్షకుడిగా నేను చెప్పాల్సింది చెబుతున్నాను.
అందరితో జాగ్రత్త! ముఖ్యంగా మనుషుల్తో!" –అన్నాడు ఏరియల్.

ఆమె ఎక్కువసేపు నిద్ర పోయిందేమోనని
పెంపుడు బొచ్చుకుక్క 'షాక్' ఆమె దగ్గరకు వెళ్లి నాలుకతో నాకి
ఆమెను లేపింది పగటి కలల నిద్ర నుంచి.
అప్పుడు, బెలిందా, ఈ కథనం సత్యమైతే
తెరచుకున్న నీ కళ్లు పడినాయి ప్రేమలేఖపై.
గాయాలు, మోహనాలు, ఉద్రేకాలు చదవబడగానే–
ఆ దృశ్యమంతా అదృశ్యమైంది నీ తలలోంచి.

స్నానాలగది ప్రత్యక్షం, తెరతీసినట్లు
వెండి పాత్రలు చక్కగా మంత్రజాలంతో అమర్చి ఉన్నాయి.
తెల్లటి దుస్తులలో కన్య నడచి వెళ్లింది
తలకు సౌందర్య సాధనాల వినియోగమిప్పుడు
ఏ ఆచ్ఛాదనా లేని ఓ చక్కటి దేవతా రూపం అద్దంలో కనిపించింది.
అటుగా ఆమె వంగుతుంది, కళ్లను ఆర్పుతుంది
మామూలు పూజారిణి, పూజాపీఠం దగ్గర
వణుకుతున్నట్లు మంత్రాలను చదివి గర్వపు తంత్రాలు మొదలెట్టినట్లు
అసంఖ్యాకపు నిధులు కనిపిస్తాయప్పుడు ఒక్కసారిగా,
ప్రపంచపు నివేదనలు పలకరిస్తాయి ఒక్కుమ్మడిగా,
వింతైన శ్రమతో ఆమె వాటిని పరిశీలిస్తుంది
ఆ మెరిసే వస్తువులతో అలంకరిస్తుంది దేవతను
ఇది ఇండియా రత్నాలతో పొదిగిన నగలపెట్టె,
ఆ పెట్టెనిండా ఉన్నాయి అరేబియా సుగంధ నూనెలు!
ఇవి తాబేలు, ఏనుగు మచ్చల, తెల్లని దంతపు దువ్వెనలు
ఇవి వరుసల్లో కూర్చబడిన మెరిసే జడపిన్నులు
పఫ్లు, పౌడర్లు, మలాములు, బైబిళ్లు, ప్రేమలేఖలు
ఇప్పుడు ఈ అందాల అమ్మాయి అందుకుంటుంది ఆయుధాలన్నిటినీ.
ప్రతిక్షణం ఆమె లావణ్యం పరవళ్లు తొక్కుతుంది.
నవ్వుల్ని పంచి, సొగసుల్ని పెంచుతుంది.
ఆమె వదనంలోని అద్భుతాల్ని ముందుకు పిలుస్తుంది.
కొద్దికొద్దిగా బుగ్గలెరుపై మెరుగుల్ని తెస్తాయి.
చక్కని మెరుపులు ఆమె కనులలో మెరుస్తాయి.
తీరికలేని సిల్ఫ్ భూతాలు ఆమె చుట్టూ తిరుగుతాయి.
అవి తల దువ్వుతాయి, ఇవి జడను అల్లుతాయి.
కొన్ని చేతుల్ని మడుస్తుంటే, కొన్ని గౌనును సర్దుతాయి.
బెట్టీ చేయని పనులకి పొగడ్తలు దొరుకుతాయి.

## 2. బెలిందా - పడవ ప్రయాణం

అంతరిక్షపు మైదానంలో పెద్ద ఆర్భాటాలు లేకుండానే
ఊదావర్ణపు ద్వారం వద్ద ఉదయిస్తాడు సూర్యుడు.
తన కిరణాలకు శత్రువైన వాడిని సృజించి
వెండి థేమ్స్ నది ఎదపైన విడుదల చేస్తాడు.
అందమైన అప్సరసలు, చక్కటి దుస్తులలో యువతులు ఆమె చుట్టూరా,
అయితే ప్రతి ఒక్కరి కన్నూ ఆమెపైనే లగ్నమైనది.
ఆమె తెల్లని రొమ్ముపై శిలువ వెలుగుతున్నది.
దానిని యూదులు ముద్దాడుతారు, అవిశ్వాసులు ప్రేమిస్తారు.
జీవంతో తొణికిసలాడే ఆమె చూపులు ఉల్లాసపు మదిని చెబుతాయి.
ఆమె కళ్లలా వేగంగా, చంచలంగా,
ఎవరికీ ప్రాముఖ్యత లేదు, అందరికీ పంచుతుంది చిరునవ్వులు.
తరచుగా తిరస్కరిస్తుంది, ఎవరినీ నొప్పించదు ఒక్కసారైనా,
సూర్యుడిలా ప్రకాశిస్తుంది, రెప్పవాల్చకుండా చూడాలనిపిస్తుంది.
అయినా, చక్కని లావణ్యం, గర్వం లేని మాధుర్యం
ఆమె లోపాల్ని దాచిపెట్టవచ్చు, కన్యలు లోపాల్ని దాచిపెట్టగలిగితే
ఆమెకూ కొన్ని స్త్రీ సహజమైన లొసుగులున్నాయి.
ఆమె ముఖం వేపు చూడు, అన్నిటినీ మరచిపోతావు నీవు.

మానవజాతి నాశనానికి సృష్టించబడిందీ కన్య!
రెండు వాల్జడలు వెనక వీపుపై అందంగా ఊగుతున్నాయి.
ఉంగరాలు తిరిగిన ఆ శిరోజాలు ఆమె మృదువైన
తెల్లని దంతపు రంగు మెడనలంకరించినాయి.
ఆ గుహలలో అవి తమ బానిసలను నిర్బంధిస్తాయి.
గొప్పగొప్ప హృదయాలు సన్నని గొలుసుల్తో బంధింపబడ్తాయి.
మనలాంటి పక్షులను ఆ శిరోజాల వంపులు మోసం చేస్తాయి.
సన్నటి వెంట్రుకల దారాలు గాలాలై రెక్కల చేపలను ఆశ్చర్యపరుస్తాయి.
అందమైన ఉంగరాల జుట్టు ఉన్నత మానవ తెగను ఉన్మత్తుల గావిస్తుంది.
ఆ సౌందర్యం మనల్ని ఒకే ఒక శిరోజంతో దగ్గరకు లాక్కుంటుంది.

సాహసవంతుడైన ప్రభువు ఆ ప్రకాశిస్తున్న జడలను మెచ్చుకున్నాడు
అతడు చూసి, కోరుకున్నాడు, బహుమతి కావాలనుకున్నాడు.
ఎలాగైనా గెలవాలనుకుని ఒక మార్గాన్ని తలపోసాడు.
బలవంతంగా శక్తితోనో, మోసంగా వంచనతోనో,
ప్రేమికుడి కష్టానికి విజయం లభిస్తే, కొందరడుగుతారు
ఎలా సాధించావు ఈ కార్యాన్ని, మోసంతోనా, శక్తితోనా అని!

దీనికై ఫీబస్ సూర్యుడు ఉదయించాడు.
అతడు స్వర్గాన్ని ప్రార్థించి, ప్రతి శక్తికీ కాంతినిచ్చాడు.
ముఖ్యంగా ప్రేమను, ప్రేమతో నిర్మించాడొక పూజాపీఠాన్ని,
ఓ డజను ఫ్రెంచి ప్రేమగాథలు, పూతపూసిన ఇటుకల్లా!
అక్కడ మూడు తాయెత్తులు, ఒక హస్తపు తొడుగు,
తన పాత ప్రేమగాథల గుర్తులు, విజయచిహ్నాలు–
కోమలమైన ప్రేమలేఖలతో అతడు చితిని వెలిగిస్తాడు.
అది బాగా మండడానికి మూడు కామపు నిట్టూర్పులు విడుస్తాడు.
ఆనక సాష్టాంగపడి, మండుతున్న కళ్లతో ప్రార్థిస్తాడు.
త్వరగానే బహుమతి గెల్చుకుని తన దగ్గరే ఉంచుకుంటాడు చిరకాలం.
దైవశక్తులు వింటాయి; అతడి ప్రార్థనను సగం మన్నిస్తాయి.
మిగతా సగాన్ని, గాలి పంపిస్తుంది ఖాళీ పవనాల్లోకి.

ఇప్పుడు చూడు రంగులద్దిన నావ ప్రయాణాన్ని,
కదుల్తున్న తరంగాలపై వణుకుతున్న సూర్యకిరణాల్ని,
కరుగుతున్న సంగీతం దొంగిలిస్తున్నది ఆకాశాన్ని,
నీటిపై మెత్తబడిన శబ్దాలు సమసిపోతున్నవి.
అలలు మృదువుగా ప్రవహిస్తున్నవి. పశ్చిమగాలి సున్నితంగా ఆడుతున్నది.
బెలిందా చిరునవ్వు నవ్వింది, లోకమంతా సంతోషమయమయ్యింది.
అంతా ఒక్క సిల్ఫ్ భూతం తప్ప–
అది అణచిపెట్టుకున్నది ఆలోచనల్ని, రాబోయే విపత్తు
అతడి హృదయంపై భారంగా కూర్చోగా–

వెంటనే పిలిచాడు గాలిలో పరివారాన్ని.
ఆ చక్కని దళాలు తెరచాపల చుట్టూ మూగినాయి.
మబ్బుల ముసుగు మీదుగా ఏరియల్ గుసగుసలు నిశ్వసించినాయి.
అలా అనిపించింది. కాని, పశ్చిమ గాలులు కిందకు కదిలాయి
కొన్ని సూర్యుడి వేపు తమ కీటకపు రెక్కలను విప్పార్చాయి.
గాలిలో ఎగురుతాయి లేక స్వర్ణమేఘాల్లో మునుగుతాయి,
పారదర్శక రూపాలు, మానవ నేత్రాలకు అగోచరాలు
వాటి ద్రవదేహాలు కాంతిలో సగం కరిగి ఉంటాయి.
వాటి పవనవీచికల వస్త్రాలు గాలికి ఊగుతుంటాయి.
పొగమంచు బిందువుల తళుకు చిత్రాలతో మెరుస్తుంటాయి.
ఆకాశపు చిక్కటి వర్ణాన్ని ప్రతిఫలిస్తుంటాయి.
కాంతి అక్కడ ఉన్న వాటినన్నిటినీ రంగులమయం చేస్తుంది.
ప్రతి కిరణమూ స్వల్పకాలపు వర్ణాలను విసుర్తుంది.
వాటి రెక్కలు కదిలినప్పుడల్లా మారుతుంటాయి రంగులు
ఆ వలయంలో, బంగరు పూత పూసిన తెరచాప స్తంభంపైన
ఉన్నతస్థానంలో అధికారికంగా కూర్చున్నాడు 'ఏరియల్'
అతడి ఊదారంగు రెక్కల ఈకలు సూర్యుడి వేపు తెరుచుకున్నాయి
అతడు తన నీలివర్ణపు మంత్రదండాన్ని పైకెత్తి ఇలా అన్నాడు–

"ఓ చిలిపి భూతకన్యలారా, సిల్ఫ్ వాయుభూతాల్లారా!
మీ ప్రభువు మాటలను ఆలకించండి!
దేవకన్యలు, అప్సరసలు, భూతాలు, మరుగుజ్జు భూతాలు, పిశాచాలు
మీ చెవులు ఇటుపెట్టి సావధానంగా వినండి!
శాశ్వత న్యాయాలు, చట్టాలు వాయుభూతాలకిచ్చిన
పరిధులు, విధుల గురించి మీకు క్షుణ్ణంగా తెలుసు,
స్వచ్ఛమైన ఈథర్ వాయు మైదానాల్లో కొన్ని ఆడుతుంటాయి.
పగటి ఎండలో తడిసి తెల్లబడుతుంటాయి.
కొన్ని గ్రహ మండలాల దారులను చూపిస్తాయి.
కొన్ని గ్రహాలు వాటి కక్ష్యలలో భ్రమించేందుకు తోడ్పడ్తాయి.

కొన్ని వెన్నెల లేతకాంతిలో మిలమిలలాడ్తుంటాయి.
రాత్రివేళలలో జారిపడే ఉల్కలను కొన్ని అనుసరిస్తాయి.
కొన్ని కాస్త దిగువన ఉన్న పొగమంచును పీల్చుకుంటాయి.
కొన్ని తమ రెక్కలను ఇంద్రధనుస్సు రంగులతో తడుపుతాయి.
కొన్ని శీతాకాలపు భీకర తుఫానులను సృజిస్తాయి.
లేదా భూగోళంపై దయతో వర్షాలు కురిపిస్తాయి.
మిగతావి, మానవజాతిని పర్యవేక్షిస్తాయి.
అన్నిరకాల పద్ధతులు, అన్ని రకాల పనులూ వినియోగిస్తాయి.
వీటిపైనే దేశాల భవిత ఆధారపడి ఉంటుంది.
దివ్య ఆయుధాలతో బ్రిటిష్ సింహాసనం కాపాడబడుతుంది.
మన మరో ముఖ్య విధి లావణ్యవతులకు సాయం చేయడం
సంతోషకరమైన పనే, కాని, విశిష్టమైనది కాదంత.
ఝంఝామారుతం నుంచి సువాసన పొడర్లను రక్షించడం
బంధించబడిన సుగంధ తైలాలను బయటకు పోనీకుండా చేయడం
వసంత పుష్పాల నుంచి తాజా రంగుల్ని తోడుకోవడం
తలంటు స్నానాల నీళ్లతుంపరలో జారిపడే హరివిల్లుల నుంచి
కాంతుల్ని దొంగిలించి స్వచ్ఛంగా మెరిసేలా చేయడం
వాళ్ల నొక్కుల జుట్టును ఉంగరాలు ఉంగరాలుగా తిప్పడం
వాళ్ల బుగ్గలు కెంపులయ్యేలా, వాళ్ల ఉల్లాసానికి స్ఫూర్తినివ్వడం
అంతేకాదు, కలల్లో కూడా, వాళ్లకు అనుగ్రహించాలి నూతన పద్ధతులు.
గౌను కుచ్చీళ్లు మార్చడంలో, కొత్త నగలు అలంకరించుకొనడంలో.

ఈరోజు కొత్త అపశకునాలు ఈ చక్కటి జంటను
బెదిరించనున్నాయి, వాటి నుంచి వీళ్లను రక్షించాలి మనం.
ఏదో ఉపద్రవం, బలం వల్లనో, వంచన వల్లనో రానున్నది.
ఎక్కడ, ఎప్పుడు అనేదాన్ని విధి దేవతలు చీకటిలో దాచిపెట్టారు
వాయుకన్యలు 'దయానా' న్యాయాన్ని అతిక్రమిస్తాయో
లేక, ఏదైనా చైనా పింగాణీ పాత్రలో దోషముంటుందో
లేక, ఆమె గౌరవానికి కళంకం వస్తుందో, జరీ అంచు చిరుగుతుందో

ఆమె తన ప్రార్థనలను మరచిపోతుందో, మారువేషాల వేడుక తప్పిపోతుందో
తన హృదయాన్ని కోల్పోతుందో, లేక కంఠహారాన్నో, నర్తనశాలలో!
స్వర్గం నిర్ణయించిందో ఆమె కుక్కపిల్ల 'షాక్'కు ఏదైనా ప్రమాదాన్ని!
భూతాల్లారా, వేగిరపడండి, పొరపాట్లను సరిదిద్దండి.
ఆ ఊగే విసనకర్ర బాధ్యత జెఫిరెట్టా –పశ్చిమగాలి కన్యది.
తెరల బాధ్యత 'బ్రిల్లాంటే'కు అప్పచెప్పుదాం.
'మొమెంటిల్లా'– గడియారం బాధ్యత నీది.
ఓ నీవు 'క్రిసిపిస్సా' ఆమె శిరోజాల రక్షణ నీది.
ఏరియల్ స్వయంగా 'షాక్' కుక్కను గమనిస్తాడు.

యాభై వాయుదేవతలకు యాభై ప్రత్యేక బాధ్యతలు.
ముఖ్యంగా 'పెట్టీకోటు' గురించి హెచ్చరికగా ఉండాలి!
చాలాసార్లు మనం చూసాం, ఏడు వరుసల కంచె కూలిపోతుంది,
గట్టి కొయ్యకట్లు, తిమింగలపు పక్కటెముకలతో చేసిందైనా!
వెండి సామాగ్రి చుట్టూరా వలయంలా కావలి కాయండి,
సువిశాలమైన ఈ ప్రదేశాన్ని సూక్ష్మంగా పరిశీలించండి!

ఎవరైనా సరే విధి నిర్వహణలో లోపం చేసినా,
తన స్థానం వదిలిపెట్టి వెళ్లినా, వేడుకనే విడిచిపోయినా,
తీవ్రంగా పరిగణించబడ్తాయి వాళ్ల తప్పులు, పాపాలు.
–సీసాల్లో దిగ్బంధనాలు, గుండు సూదులతో గుచ్చడాలు
చెడునీళ్లు నిలవున్న చెరువుల్లోకి విసిరేయడాలు,
దబ్బనం కంటిలో ఏళ్లపాటు ఉంచడాలు,
జిగుర్లు, సుగంధ లేపనాల్లో చిక్కుపడేయడాలు–
కాళ్లూ, రెక్కలు అతుక్కుని నానా అవస్థలు పడాలప్పుడు.
రక్త స్రావాన్నాపే, కుంచించుకునే ద్రవాల్లో పడేస్తే
జీవశక్తి క్షీణించగా వాయుభూతం వాడిన పుష్పమౌతుంది.
ఇక్సియాన్ చక్రానికి కట్టేయగా పడే ఇబ్బందులు
తిరగలి చక్రంలా తిరుగుతుంటే కళ్లు తిరగడాలు,

మండుతున్న చాక్లెట్టు పొగల్లో వెలగడాలు,
దిగువన పారుతున్న నురగల సముద్రాన్ని చూసి వణకడాలు!
ఇవన్నీ విధి అలక్ష్యానికి విధించే శిక్షలు”–
అలా పలికినాడు ఏరియల్.
–తెరచాపల నుంచి దిగివచ్చాయి
అప్పుడు వాయు దేవతలు, భూతాలు, పిశాచాలు
కొన్ని ఆ కన్య చుట్టూరా చేస్తున్నాయి ప్రదక్షిణాలు
కొన్ని ఆమె ఉంగరాల జుట్టుకు ఇస్తున్నాయి మెరుపులు.
కొన్ని ఆమె తాటంకాలకు అంటిపెడ్తున్నాయి తళుకులు
ఎక్కువవుతున్న గుండెచప్పుడుతో
ఏమి కానున్నదో అన్న ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నాయవి.
ఆతురతతో, విధి, జననం కోసం వణుకుతూ–

## 3. హ్యాంప్టన్ భవనంలో పేకాట, శిరోజాల కత్తిరింపు

సతత పుష్పకిరీట ధారిణులైన మైదానాల పక్కన
ఎక్కడైతే థేమ్స్ నది తన కోట బురుజులను గర్వంతో చూస్తుంటాడో
అక్కడ రాజసం ఉట్టిపడుతున్న ఓ కట్టడమున్నది.
పొరుగు ప్రాంతమైన హ్యాంప్టన్ పేరును పెట్టుకున్నది.
ఇక్కడ బ్రిటిష్ రాజకీయవేత్తలు జోస్యాలు చెప్పుకుంటుంటారు.
విదేశాల నియంతల పతనాలను, ఇంటి దగ్గర కన్యల కథనాలనూ
ఇక్కడ నీవు గొప్పవాడివి! మూడు రాజ్యాలు నీకు విధేయులు
వాళ్లతో ఒక్కోసారి సలహా సంభాషణలు, ఒక్కోసారి తేనీటి ముచ్చట్లు

ఇక్కడ నాయికా నాయకులు విహరిస్తుంటారు
రాజసభలోని ఆనందాలను రుచిచూస్తుంటారు.
రకరకాల ముచ్చట్లతో కాలం గడుపుతారు.
కొందరు ఆతిధ్యాన్నిస్తారు, కొందరు నృత్యగానాలలో మునిగితేల్తారు.
ఒకడు బ్రిటిష్ రాణి కీర్తి ప్రతిష్ఠలను ఘనంగా పొగిడితే
ఇంకొకరు ఇండియాలోని మనోహర దృశ్యాల్ని వర్ణిస్తాడు.

మూడవవాడు నడక, చూపులు, నేత్రాలను అభివర్ణిస్తుంటే
ఒక్కొక్క మాటకు ఒక్కో పేరు ప్రఖ్యాతులు నేలకూలతాయి.
ముచ్చట్లకు ముచ్చట్లకూ మధ్య నశ్యమో, విసనకర్రో ఇవ్వబడ్తుంది
పాటలు, నవ్వులాటలు, కళ్లతో మాటలాటలు, అన్నీనూ.

ఇంతలో మధ్యాహ్న సమయం దాటింది కాబోలు
సూర్యుడు తన కిరణాల్ని ఏటవాలుగా విసురుతున్నాడు.
ఆకలేస్తుంటే న్యాయాధిపతులు త్వరగా శిక్షలు ఖరారు చేస్తున్నారు.
కక్షిదారులు, న్యాయపు సలహా సభ్యులు భోజనాలకు పోతున్నారు.
సంతల నుంచి వ్యాపారస్తులు శాంతితో వస్తున్నారు.
విశ్రాంతి గృహాల శ్రమలు కాసేపు ఆగినాయి.
బెలిందాను ఇప్పుడు కీర్తిదాహం ఆహ్వానించినది.
ఇద్దరు సాహస ప్రభువుల్ని కలవడానికి ఇటే వస్తున్నది.
'ఓంబర్' పేకాటలో వాళ్లను ఒక్కతే ఓడించాలనుకున్నది.
తన రొమ్మును విజయగర్వంతో ఉబ్బించాలనుకున్నది.
మూడు రాజ్యాలు సర్వలాంఛనాలతో దిగాయిప్పుడు యుద్ధానికి.
ప్రతి దళానికీ పవిత్ర సంఖ్య తొమ్మిదే.
ఆమె తన పేక ముక్కల్ని తెరవబోతున్నది.
ఏరియల్ జాగ్రత్త, ప్రతి ముఖ్యమైన ముక్కను కాపాడు సఖ్యంగా!

తొలుత ఏరియల్ కూర్చున్నాడు 'మటాడొర్' పైన
మిగతా పరివారం వాళ్లవాళ్ల హోదాలకు తగినట్లుగా
వాయుభూతాలు చిలిపి సిల్ఫ్‌లు తమ తాతముత్తాతల్లానే
అందమైన ఆడపిల్లలున్న చోట ఆనందంగా తిరుగుతుంటారు.

చూడు, చూడు, నలుగురు రాజులు, రాజసంగా,
మెలిదిరిగిన మీసాలు, ఫోర్క్‌లా చీలిన గడ్డాలు
నలుగురు అందాల రాణులు చేతిలో చక్కని పుష్పాలు
వాళ్ల మృదువైన శక్తిని వెల్లడించు చిహ్నాలు.
నలుగురు సేవకులు, ఉచిత వస్త్రధారులు, పరమ విధేయులు

తలపై టోపీలు, చేతిలో పదునైన ఈటెలు.
మిగతాది రంగురంగుల సైనికులు, ప్రకాశించే దళాలు
వెల్వెట్ మైదానంపై యుద్ధానికి సిద్ధమైనారు.

నిపుణురాలైన యువతి నిశితంగా పరిశీలించింది తన సైన్యాన్ని
ఈసారి ట్రంప్‌కార్డ్ 'స్పేడ్', అన్నదామె, స్పేడ్ లే ట్రంపులు.
ఆమె నల్లటి మటాడొర్ వీరులు కదిలినారు ముందుకు
చూస్తుంటే వాళ్లు శ్యామలవర్ణ 'మూర్' యోధుల నాయకుల్లా ఉన్నారు.
స్పేడిల్లియో ముందు కురికాడు, ఓటమినెరుగని ధీరుడు!
రెండు ట్రంపులేసినాడు, బోర్డును తుడిచేసినాడు.
చాలా 'మనిల్లియోలు' లొంగిపోయాయా శక్తికి
ఆకుపచ్చని మైదానంలో అతడు విజేతగా నడిచినాడు.
'ఒస్తో' వంతు వచ్చిందిపుడు, కాస్త కష్టమైన విధివ్రాత.
ఒక ట్రంపు, ఒక ప్లెబియన్ సామాన్యుడిని గెలిచినాడు ఆతడు
తన వెడల్పాటి కత్తితో వచ్చినాడు ముఖ్యుడైన వీరుడు
స్పేడులకు నాయకుడు కాలు ముందుకు పెట్టినాడు.
అతడి మిగతా రంగుల అంగీ దాగున్నది కనబడకుండా.
తిరుగుబాటు సైనికుడొకడు తన ప్రభువును సవాలు చేసినాడు.
రాజాగ్రహానికి గురై కోల్పోయినాడు ప్రాణాలు.
అయిదు ముక్కల పేకాటలో కళావరు జాకీ–పామ్
'ల్యూ' యుద్ధంలో ఊచకోత కోసేవాడు శత్రువుల సైన్యాన్ని.
పాపం, దురదృష్టం! తోడెవరూ రాని ఈ యుద్ధరంగాన
విజేత స్పేడ్ చేతిలో ఓడిపోయినాడు ఘోరంగా.

బెలిందాకు రెండు సైన్యాలు లొంగిపోయాయి ఇప్పటి వరకు
ఇప్పుడు విధి కాస్త మొగ్గింది ప్రభువు బారన్ వేపు యుద్ధాన
అతడి అమెజాన్ రాణి నడిచింది కత్తిదూసి
స్పేడ్ కిరీటంతో ఉన్న మహారాజు భార్య ఆమె.
నల్లటి నియంత కళావరు రాజు, వదిలినాడు ప్రాణాలు ఆమె ఖడ్గధాటికి.

అతడి ద్వేషమూ, పగ అతడితోనే పోయినాయి.
రాజుల కూటమిలో ఎదురులేదు ఒకనాడు.
అతడి పెద్దపెద్ద చేతులు అదుపులో ఉండేయికాదు.
అతడి వెనుక ఆడంబరంగా వేలాడే అంగీ
భూగోళాన్ని పట్టుకున్న సార్వభౌములలో అతడొకడు.

ఇప్పుడు బారన్ డైమండ్లను విరజిమ్ముతున్నాడు.
చక్కని అల్లికల అంగీ అతడి సగం వదనాన్నే చూపిస్తున్నది.
అతడి దేదీప్యమానమైన రాణి, ఉమ్మడి శక్తులతో
విజయం ఖచ్చితమనుకున్నది, చెల్లాచెదురైన సైన్యాన్ని చూసి
క్లబ్బులు, డైమండ్లు, హార్ట్స్ అన్నీ చిందరవందరగా
ఆకుపచ్చని మైదానంపై గుంపులుగా మూగినాయి.
పరాజితులైన సైన్యం పారిపోతూ వెన్ను చూపినట్లు
ఆసియా సైన్యాల్లా, ఆఫ్రికా కృష్ణవర్ణ వీర కుమారుల్లా
వివిధ దేశాల వాళ్లు గందరగోళంగా పారిపోతున్నట్లు
రకరకాల అలవాట్లు, రకరకాల ఆహార్యాలు
పారిపోయే సైన్యాలు పరాజితులు కాక తప్పదు.
కుప్పలు కుప్పలుగా విధి వాళ్లని కూల్చివేసింది.

డైమండ్ 'నేవ్' తన కుయుక్తుల్ని ప్రదర్శించి
గెలిచినాడు (ఎంత అవమానం!) క్వీన్ ఆఫ్ హార్ట్స్‌ను.
దానితో పాపం వివర్ణమయ్యింది ఆమె ముఖం.
పాలిపోయిన హృదయరాణి కూలబడిపోయింది.
వస్తున్న ప్రమాదాన్ని వణుకుతూ చూసింది.
శిధిలాల దవడల్లో చిక్కుకుపోయింది.
'కొడిల్లె'కు చిక్కిన చిరాకు పరిస్థితి,
ఒక సరైన ఉపాయం మారుస్తుంది ఆట గతి.
'ఏస్ ఆఫ్ హార్ట్స్' వచ్చింది వేగంగా అప్పుడు
కనబడని కింగ్ దుఃఖించినాడు రాణి దురవస్థకు.
ప్రతీకారేచ్ఛతో ఉరికినాడు బాగా ముందుకు

పడి ఉన్న 'ఏస్' మీద పిడుగులా పడినాడు.
ఆ కన్య ఆనందానికప్పుడు లేవులే హద్దులు.
నింగీ, నేలా, గోడలు, అడవులు, కాలువలిచ్చాయి జవాబులు.

ఓ ఆలోచన లేని మర్త్యులారా! విధి వ్రాతను చూడలేరు మీరు.
అప్పుడే విషాదం,  అంతలోనే సంతోషం.
చటుక్కున ఈ గౌరవాలు ఎవరో లాక్కుపోతారు
ఈ విజయదినాన్ని చిరకాలం శపిస్తారు.

లో! బల్లమీద అందంగా కప్పులూ, స్పూనులూ
బెర్రీల చప్పుళ్లు, తిరుగుతున్న మరలు
జపాన్ పీఠాలపై మెరుస్తున్న ఆహారాలు
వెండి దీపాలు, జ్వలిస్తున్న అగ్ని ద్రవాలు
వాటి వెండి మూతుల్నుంచి జారుతున్న మధువులు
ధూమాల అలలను స్వీకరించే చీనా మృణ్మయ పాత్రలు
ఆ పరిమళాలు, రుచులతో సంతృప్తిపడినాక
తరచుగా కప్పులు దాహార్తిని తీర్చినాక
అందాలకన్య చుట్టూరా మూగినాయి వాయుభూతాలు,
కొన్ని ఆమె జ్వాలామధువుపైన వీవనలు వీచినాయి.
కొన్ని ఆమె ఒడిలోన ప్రదర్శించాయి, వాటి వాటి శిఖలను
కొన్ని జరీ అంచు అంగిపై జారుతూ వణికినాయి.
కాఫీ– (ఇది రాజకీయ నాయకులకు ఇస్తుంది జ్ఞానం,
వాళ్లు ప్రపంచాన్ని చూస్తారు అరమోడ్పు కళ్లతో)
–బారన్ మెదడులోకి పంపింది హెచ్చుగా ఆవిరిని
కొత్త కొత్త వ్యూహాలు, ఉంగరాల ముంగురులు ప్రేరేపించు కోరికలు
ఆగు, ఆగు, దుందుడుకు యువకుడా, నిగ్రహించుకో నిన్ను నీవు
దేవుళ్లు చూస్తున్నారు, జాగ్రత్త, గుర్తు తెచ్చుకో 'స్కిల్లా' గతి!
పక్షిలాగా రూపుమారి, పాపం, ఎగుర్తున్నది గాలిలో
'నైసస్' జుట్టును పాడుచేసి అనుభవిస్తున్నది శాపాన్ని,

ఎప్పుడైతే మర్త్యులు, చెడుపని చేయడంపై మనసు నిలిపారో
అంత త్వరగా వాళ్లకు అందుతాయి తగిన ఉపకరణాలు.
అప్పుడే, క్లారిస్సా, రెచ్చగొట్టే హొయలుతో
తన మెరిసే పెట్టె నుంచి తీసిందో రెండంచుల ఆయుధాన్ని!
ప్రేమలో పడిన యువరాణులు తమ ప్రభువు కందిస్తారు
పదునైన బల్లేన్నిచ్చి యుద్ధరంగానికి పదమంటారు.
అతడా కానుకను భక్తితో తీసుకుని,
తన చేతుల చివర్లతో గట్టిగా పట్టుకుని
బెలిందా మెడవేపు నెమ్మదిగా పోనిచ్చి-
పరిమళాల ఆవిరులలో పరవశిస్తున్నదా కన్య
కాస్త తలవంచిన సమయాన్ని అనువుగా చూసుకుని
వేయి భూతాలు కావలున్న శిరోజాల అల్లికను
వేయి రెక్కలతో (వంతులవారీగా) కదిలించే శిరోజాలను-
మూడుసార్లు వాళ్లు కదిలించారు చెవికమ్మ వజ్రాన్ని,
మూడుసార్లు ఆమె తిరిగి చూసింది వెనక్కి,
మూడుసార్లు శత్రువు మరింత ముందుకు కదిలాడు,
సరిగా అదేక్షణంలో, కళవళపడుతూ ఏరియల్
ఆ కన్య మనసులోని ఆలోచనలను గమనించినాడు.
ఆమె రొమ్ములపై విశ్రమించిన  పుష్పగుచ్ఛంలా
అతడు గమనించాడు, ఆమె మనసులో ఎగసిపడ్తున్న ఆలోచనలను,
ఆమె ఎంతో కళాత్మకంగా దాచుకున్న రహస్యాన్ని,
ఆమె ఎదలో దాగిఉన్న మానవ ప్రేమికుడిని,
ఆశ్చర్యంతో, కలవరంతో గమనించాడు తన శక్తులు నశించడం
విధికి తల ఒగ్గినాడు, నిట్టూర్పుతో నిష్క్రమించినాడు.

ప్రభువు ఇప్పుడు ఆ మెరిసే కత్తెరను తెరచినాడు వేడ్కగా,
జడగా అల్లిన శిరోజాల పాయను కత్తిరించినాడు చక్కగా,
ఆ కత్తెర మూసుకునే ఆఖరిక్షణంతో అల్లరి వాయుభూతం
అడ్డుగా నిలిచింది కాని, ఏంలాభం, అదీ కత్తిరించబడింది రెండుగా
(అయినా విడిపోయిన గాలికి కలవడం మామూలే)

ఆ కత్తెర ప్రశస్తమైన రెక్కలూ కలుసుకున్నాయి రెండూ,
అందాల శిరస్సు దగ్గర, శాశ్వతంగా, శాశ్వతంగా!

అప్పుడు ఆమె కళ్లనుంచి కురిసాయి మెరుపులు
కళవళ పడిన నింగికి తూట్లు పొడిచాయి కేకలు.
స్వర్గాన్ని దయచూడమని పెట్టే పెడబొబ్బలు కాదు
ప్రియభర్తలో, పెంపుడు కుక్కలో చనిపోతే చేసే రోదనలు కావు.
చైనా పింగాణీ పాత్ర కిందపడి పగిలితే పెట్టే కేకలు కాదు.
దుమ్ములో పడి ముక్కల పొడి మెరుస్తుంటే ఏడ్చే ఏడ్పులు కాదు.

–'విజయ పుష్పగుచ్ఛాలు నా చెవిపక్కల స్పృశించనీ
(విజేత అరిచాడు) ప్రశస్తమైన కానుక నాకు దక్కింది!
వాగులో చేపలా, గాలిలో పక్షిలా ఆనందమే ఆనందం!
గుర్రపు బగ్గీలో పయనించినట్లు, బ్రిటిష్ సంతలో ఆడినట్లు
అట్లాంటిస్ వరకూ నా ఖ్యాతి, అన్ని దిక్కులా వ్యాపించనీ
లేక యువతి శయ్యపై తలగడగా నా కీర్తి అలంకరించబడనీ!
పవిత్ర దినాల్లో దర్శనాలను అభిలషించనీ,
అసంఖ్యాక కొవ్వొత్తులు ప్రకాశవంతంగా వెలగనీ,
యువతులు ఆడనీ పాడనీ, బహుమతులు, హోదాలు పొందనీ,
నా గౌరవం, పేరు, ప్రతిష్ఠలు చిరకాలం నిలవనీ!

కాలం వదిలిపెట్టిన తేదీని ఖడ్గం నుంచి తీసుకుంటుంది
మనుష్యుల్లానే, మహా కట్టడాలూ విధికి లొంగుతాయి.
దేవతల శ్రమను లోహపు ఆయుధాలు ధ్వంసం చేస్తాయి.
ట్రాయ్ సామ్రాజ్యపు దుర్గశిఖరాలు ధూళిలో కొట్టుమిట్టాడుతున్నాయి.
మానవుల గర్వమంతా కత్తివాదరకు మట్టిలో కలుస్తుంది.
విజయతోరణాలు నేలమట్టమవుతాయి.
అందమైన కన్యా! ఎందుకు ఆశ్చర్యం!
నీ శిరోజాలు ఆ అనుభూతిని పొందనీ,
అడ్డూ ఆపూలేని లోహపు శక్తుల ఆక్రమణ తేజాన్ని

# 4. బెలిందా దుఃఖం, ఆగ్రహం

అయితే, తనలోని వ్యాకులతను గాఢంగా అణిచిపెట్టిందాకన్య.
రహస్య ఉద్వేగాలుప్పొంగాయి తీవ్రంగా ఆమె ఎదలోన.
యువకులైన ప్రభువులు యుద్ధంలో సజీవంగా పట్టుబడినా,
లావణ్యవతులైన యువతుల ఆకర్షణలు తిరస్కరించబడినా,
ఉద్రేకులైన ప్రేమికుల ఆనందాన్నెవరైనా దోచుకోబోయినా,
పాతకాలపు యువతుల ముద్దునెవరైనా తిరస్కరించినా,
భీకర నియంతలు పశ్చాత్తాపపడుతూ మరణించాల్సి వచ్చినా,
సింథియా పైట చెరుగును వక్రంగా గుచ్చిపెట్టినా,
అటువంటప్పుడు కూడా వాళ్లకు ఇంత ఆగ్రహం, కోపం,
నిరాశ రావడం ఎవరూ చూసి ఉండరు.
ఓ కన్యా! ఎంత కోపం నీకు, నీ జుట్టును అవమానించినందుకు!

ఎందుకంటే, ఆ విషాద క్షణాన, గాలిభూతాలు తప్పుకున్నాయి
ఏరియల్ ఏడుస్తూ బెలిందా నుంచి తప్పుకున్నాడు.
అంబ్రియల్, -ఓ చీకటి విషాద రూపపు భూతం
కాంతి వదనాన్ని మసకపరచే ఆ పిశాచం
భూమి కేంద్రానికి వచ్చినాడు, తనకు కావాల్సిన దృశ్యంలోకి,
వచ్చి స్ప్లీన్-ప్లీహపు చీకటి గుహలో శోధిస్తున్నాడు.

తన బూడిద వర్ణపు ఈకలను ఆడిస్తూ ఆ భూతం,
ఆ నిరాశా పైకప్పులో ఆవరించిన ఆవిరిలో,
ఈ ప్రాంతమెరుగదు చిరునవ్వుల చిరుగాలుల్ని ఎన్నడూ,
గాలి వీస్తున్నది ఆ భీకరమైన తూర్పు దిక్కువేపు.
ఇక్కడ ఈ గుహ, గాలి నుంచి వేరుచేయబడి ఉన్నది
పగటి ఎండ తీక్షణత, నీడలతో ఆపబడి నిలిచినది
విషాదపు శయ్యపై కూర్చుని ఆమె విడుస్తున్నది నిట్టూర్పులు
పక్క నెప్పి, తల వద్ద శిరోవేదన (మైగ్రేన్).

ఇద్దరు పరిచారికలు సింహాసనం పక్కన
ముమ్మూర్తులా అచ్చుగుద్దినట్లే అనిపించినా
ఆకారంలో, వదనంలో మార్పు దగ్గర్నుంచీ చూస్తే.
ఇక్కడ నిలబడింది 'దుష్ప్రవర్తన' పాతకాలపు బానిసలా
ఆమె వక్రరూపం తెలుపు నలుపుల మిశ్రమం
ఉదయం, రాత్రి, మధ్యాహ్నం ప్రార్థనలే ప్రార్థనలు.
ఆమెకిప్పుడు చేతినిండా పని, గుండెలో ప్రహసనాలు.

కన్య ముఖకవళికలలో బుద్ధిపూర్వక ప్రదర్శనాలు;
ఆమె బుగ్గలలో కనిపించాయి పద్దెనిమిదేళ్ల గులాబీలు;
అస్పష్టంగా మాటలు, తల వేలాడేయడాలు
గాలిలో మూర్ఛలు, కృశించిన గర్వాలు
దుఃఖమే తానై రజాయిపై క్రుంగడాలు.
రుగ్మత అయినా ప్రదర్శన అయినా, గౌనులో మునిగిపోవడాలు.
అందమైన కన్యలకు ఈ జబ్బులు సర్వసాధారణాలు.
ప్రతిరాత్రి దుస్తులూ తెస్తాయి సరికొత్త వ్యాధులు.
కమ్ముకున్నాయి భవనాన్ని, స్థిరంగా వేడి ఆవిరి పొగలు
పొగమంచు పెరిగినకొద్దీ వస్తున్నాయి వింత వింత భూతాలు.
వెంటాడే నీడల్లో సాధువు స్వప్నాల భీకరాకారాలు
చనిపోతున్న కన్యల ప్రకాశవంతమైన దర్శనాలు
తీవ్రంగా చూస్తున్న దయ్యాలు, భవనపు శంకువుపై సర్పాలు
పాలిపోయిన రాజదండాలు, తెరవబడిన సమాధులు, ఊదారంగు మంటలు
స్వర్ణ ద్రవపు సరస్సులు, ఎలిషియం క్షేత్ర దృశ్యాలు
స్ఫటిక గోపురాలు, యంత్రాలలో దేవదూతలు.

తలో పక్షం చేరినాయి అసంఖ్యాక గుంపులు
స్ప్లీన్ శక్తితో వచ్చాయి వాటికి వేర్వేరు రూపాలు
సజీవ తేనీటిపాత్రలు నిలబడ్డాయి చేతులు చాచి
ఒకటి వంగి, ఒకటి హాండిల్‌లా, ఒకటి పాత్ర మూతిలా.

ఓ చట్టి మూకుడు నడుస్తోంది హోమర్ త్రిపీటికలా,
ఇక్కడ 'జాడీ' నిట్టూరుస్తున్నది, అక్కడ 'బాతుగిన్నె' పలుకుతున్నది.
మగవాళ్లు గొప్ప పనులు చేసినట్లు చెబుతారు పిల్లలకు
ఆడవాళ్లుగా మారిన సీసాలు అరుస్తాయి కావాలని కార్కు బిరడాలు.

ఈ అద్భుతమైన గుంపు గుండా నడిచిందా భూతం
చేతిలో పట్టుకుంది 'స్ప్లీన్ వొర్ట్' మూలికను,
వచ్చి, అధికారశక్తిని సంబోధించింది– 'జయం జయం మహారాణీ!–
యాభై నుంచి పదిహేను వరకూ శృంగారాన్ని నియంత్రించే రాణి
స్త్రీల హాస్యాలకూ, ఆవిరులకూ జన్మనిచ్చేదానివి
వాళ్లకు హిస్టిరియా లేదా కవిత్వపు కింకలనిచ్చేదానివి
అది పని చేస్తుంది రకరకాల తీవ్రతలపై రకరకాల విధాలుగా
కొందరు చేస్తారు వ్యాయామం, కొందరు రాస్తారు కవిత్వం
గర్విష్ఠులు చేసే ఆలస్యాలకూ అదే కారణం.

దేవుడిలాగా పెంపుడు జంతువును పంపుతుంది ప్రార్థించడానికి
ఒక కన్య వాళ్ల అధికారాన్ని తృణీకరిస్తే ధిక్కరిస్తే
వేలాదిమంది అలాంటి కన్యలు దొరుకుతారు వాళ్లకు.
అయితే, ఓహ్! ఎప్పుడైనా ఓ భూతం నీ హుషారును పాడుచేస్తే
లేదా, చిన్న మెటిమను నీ ముఖంపై మొలిపింపజేస్తే
నిమ్మనీళ్లు మాట్రన్ బుగ్గలను ఎరుపెక్కించినట్లు
లేదా, ఆట ఓడిపోతున్నపుడు ముఖం రంగులు మారుతున్నట్లు
ఎప్పుడైనా నేను గాలి కొమ్ములతో శిరస్సులను పాతిపెడితే
లేదా పెట్టికోట్లను నలిపి, పరుపులను పడవేస్తే
లేదా ఏ ఆత్మా మొరటుగా లేనప్పుడు అనుమానాన్ని కలిగిస్తే
లేదా శృంగారం మాటే వినని యువతి శిరోవేష్ఠనాన్ని తొలిగిస్తే
లేదా ఎప్పుడైనా మలబద్ధకపు బొచ్చుకుక్కకు వ్యాధిని తగిలిస్తే
ఇవేవీ కాంతివంతమైన కన్నుల కన్నీటిని తొలగించవు.
విన్నావా, వెళ్లి బెలిందాలో రగిలించు ఆగ్రహాన్ని.
ఈ చిన్న పని కలిగిస్తుంది సగం ప్రపంచానికి 'స్ప్లీను'తో హాని.

సంతృప్తి లేని గాలిలో శక్తిదేవత అతడిని తిరస్కరించినా
మన్నించింది అతడి ప్రార్థనను.
ఆమె చేతిలో ఓ అద్భుతాల సంచి,
ఆరోజుల్లో యులిసిస్ గాలుల్ని బంధించినటువంటిది.

దానిలో ఆమె పట్టుకున్నది స్త్రీల ఊపిరితిత్తుల శక్తిని,
నిట్టూర్పులను, వెక్కిళ్లను, ఉద్వేగాలను, నాలుక యుద్ధాలను
ఆ తరువాత ఒక గాజు సీసాలోకి మూర్ఛల భయాల్ని
మెత్తటి దుఃఖాల్ని, కరుగుతున్న విచారాల్ని పారే కన్నీళ్లను పట్టుకున్నది.
మనిషిలా ఉండే నోమ్ (Gnome) భూతం
ఆమె ఇచ్చిన బహుమతుల్ని ఆనందంగా తీసుకుని
నల్లని రెక్కల్ని కదిలించి పగటివేపు వెళ్లిపోయింది.

థాలెస్ట్రిస్ చేతుల్లో ఒరిగిన కన్యనతడు చూసాడు,
ఆశాభంగం చెందినట్లున్న ఆమె కనులు, ముడివేయని కురులు,
ఆ సంచి సంచీ అతడామె తలపైన గుమ్మరించాడు
అందరు ఆగ్రహానల దేవతలు–ఫ్యురీస్ గొంతు అరువిచ్చారు.
కాలిపోతున్న బెలిందా కోపమిప్పుడు మర్త్యుల కోసం కాదు–
భీకర థాలిస్ట్రిస్, రగిలే మంటపై ఇంకాస్త గాలి విసిరింది.

–'ఓ దురదుష్టపు కన్యా! ఆమె చేతులు చాచింది, శోకాలు పెట్టింది.
(హాంప్టన్ ప్రతిధ్వనించింది– 'ఓ దురదృష్టపు కన్యా! ప్రతి జవాబు)
ఈ దురదృష్టానికా నీవిన్ని జాగ్రత్తలు తీసుకున్నది?
పక్కపిన్నులు, దువ్వెనలు, సువాసన నూనెలు తయారుచేసావే,
ఇందుకా ఎంతో జాగ్రత్తగా కాగితపు గొట్టాలకు ఉంగరాల్లా చుట్టిందీ,
ఇందుకా శిరోజాల్ని ఐరన్ చేసి నన్ను చిత్రహింసలు పెట్టిందీ,
ఇందుకా తలకు అంతులేని వేదనను కలిగించింది?
ఆ సీసపు బరువులన్నీ ఎంతో ధైర్యంగా మోసింది ఇందుకా?
అయ్యో దేవుళ్లారా! ఆ బలాత్కారుడు ఈ శిరోజాలను బహిరంగంగా ప్రదర్శిస్తాడా.
మూర్ఖులు అసూయపడతారు, ఉన్నతస్త్రీలు ఉలిక్కిపడతారు'

గౌరవం మట్టిలో కలిసింది; పోటీలేని మందిరం వద్ద
ప్రశాంతత, సుఖం, శీలం, అన్నీ మన స్త్రీలకు ముఖ్యమైనవి.
నీ కన్నీళ్లు సర్వేక్షణను నేను గమనించాను.
వాళ్లనుకుంటున్న అసహ్యకరపు మాటలను విన్నాను.
నీకు ఇప్పటికే తగ్గిన హోదాను చూస్తున్నాను.
ఒక్క గుసగుసలో నీ గౌరవమంతా నశించిపోయిందే!
అలా అయితే, నేను, నీ కీర్తిప్రతిష్ఠలనెలా కాపాడగలను?
లేకుంటే మన స్నేహానికే మచ్చరాదా!
ఈ బహుమతి వెలకట్టలేనిది కాదా,
చూసే కళ్లకు స్ఫటిక గోళంలో నుంచి కనిపిస్తూ
వజ్రపు వలయ కిరణాలతో మరింత పెద్దదిగా ఉండగా
ఆ అత్యాశ హస్తాలలో మెరిసిపోదా ఎప్పటికీ!
హైడ్-పార్క్ సర్కస్‌లో గడ్డి పెరిగినంత త్వరగా
వింటినారి శబ్దంలో హాస్యం నివాసమేర్పర్చుకున్నట్లు
ఈ నేల, గాలి, సముద్రం, అన్నీ కేయాస్-గందరగోళంలో పడిపోనీ,
మనుషులు, కోతులు, బొచ్చుకుక్కలు, చిలుకలూ అన్నీ నశించిపోనీ!

ఆమె అన్నది- 'సర్ ఫ్లమ్'ను రెచ్చగొడ్తూ (అతడామె సొగసుకాడు)
తన స్నేహితురాలి నుంచి కత్తిరించిన జడ తెమ్మని గద్దించింది.
(సర్ ఫ్లమ్- దంతపు నశ్యపు పెట్టెలా, ఆడంబరం
మబ్బులు కమ్మిన వెదురు కర్రలా అతడి ప్రవర్తనం)
తీక్షణమైన నేత్రాలతో, ఆలోచించని గుండ్రటి వదనంతో
అప్పుడతడు ముందుగా నశ్యపు పెట్టెను,
తరువాత లోనిపెట్టెను తెరచి కేకపెట్టాడు.
-'ప్రభూ, ఏమిటి, ఏమిటీ దయ్యపు వ్యవహారం?
వెధవజుట్టు! దేవుడి ముందు ప్రవర్తించు సరిగా?
అది పాడైపోనూ! హాస్యం మించిపోయింది,
అయ్యో! స్ఫోటకమా! ఆమె శిరోజాలు ఆమెకిచ్చేయి!'-
అన్నాడు, అని మూసినాడు దంతపు పెట్టెను.

–'ఇది నాకు దుఃఖాన్ని కలిగిస్తున్నది (అన్నాడు **ప్రభువు**)
బాగా మాట్లాడేవాడు ఎప్పుడూ అనవసరంగా మాట్లాడకూడదు.
అయితే, ఈ ఉంగరాల జుట్టు, ఈ పవిత్రమైన జుట్టుకోసం ప్రమాణం చేస్తున్నా!
(తన స్థానాన్ని తిరిగి పొందలేని జడపాయను గురించి చెబుతున్నా,
దానికి వెనకటి మర్యాదలెక్కడి నుంచి వస్తాయి? ఇప్పుడు?
అందమైన తల నుంచి కత్తిరించబడినాయే!)
నా ముక్కు రంధ్రాలు జీవన వాయువుల్ని పీల్చుతున్నంతకాలం
ఈ హస్తం, గెలుచుకున్న ఈ హస్తం, వాటిని ధరిస్తుంది ఎల్లకాలం!'–
అంటూ అతడు విజయగర్వంతో చూపించాడు
ఎప్పటి నుంచో పొందాలనుకుని, ఇప్పుడు పొందిన ఆమె శిరోజాల్ని.

అయితే, అంబ్రియెల్, ద్వేషపు భూతం! ఓర్చుకుంటుందా అవమానం?
అతడు తన చేతిలోని గాజు సీసాను పగలగొట్టినాడు తక్షణం.
అప్పుడు చూడు, ఆ కన్య దుఃఖంలో ప్రత్యక్షమయ్యింది.
ఆమె కళ్లు సగం ఉత్సుకతతో, సగం కన్నీళ్లతో మునిగిపోయాయి
భారంగా ఊపిరి తీసుకుంటూ, భుజాల మీద వాల్చుకున్నది తన తలను
మరల, ఒక నిట్టూర్పుతో తలపైకెత్తి, ఇలా అన్నది–

"ఇటువంటి దురదృష్టపు రోజు శపించబడును గాక!
ఈరోజు అది నాకెంతో ఇష్టమైన జడపాయను ఎత్తుకుపోయింది.
సంతోషంగా, పదిరెట్లు సంతోషంగా, ఉండి ఉండేదాన్ని
ఈ కళ్లు హాంప్టన్ కోర్టును చూడకుండా ఉండి ఉంటే!
అయినా, నేనొక్కదానినే తొలిసారిగా ఇలా తప్పుగా అనుకోవడం లేదు.
ఇలా ఎంతమందో ఇంతకు ముందు పరాభవించబడినారు.
ఓహ్! దీనికన్నా ఎటువంటి మెప్పులూ లేకుండా
ఏ ఒంటరి ద్వీపంలోనో ఉండి ఉంటే బాగుండేదాన్ని.
లేదా ఏ ఉత్తర ధృవప్రదేశాల్లోనో, ఎక్కడైతే,
ఎక్కడైతే గిల్టు రథచక్రాల చాళ్లు కనిపించవో,
ఎక్కడైతే ఓంబర్ పేకాట నేర్చుకోరో, ఎక్కడైతే బొహియా 'టీ' రుచిచూడరో

అక్కడ నా అందాలను, లావణ్యాన్ని మనుషుల కంటపడకుండా దాచిపెట్టి ఉండేదాన్ని,
ఎడారుల్లో వికసించి, నశించే గులాబీలా!
నా మనసుకేమయ్యింది ఇలా నేను యువప్రభువులతో తిరగడానికి?
ఇంటివద్దనే ఉండి, నా ప్రార్థనలు నేను చేసుకుని ఉంటే బాగుండేది కాదా
ఉదయం శకునాలు నాకేదో చెప్పాలని ప్రయత్నించినాయి-
మూడుసార్లు నా చేతి నుంచి పాచ్-బాక్స్ పడిపోయింది.
గాలి లేకుండానే చైనా పింగాణీ గలగలలాడింది.
లేదు లేదు, 'పొలి'చిలుక మూగగా కూర్చున్నది.
'షాక్' కుక్క దయలేకుండా మొరిగింది.
ఓ వాయుభూతం నాకేదో హెచ్చరికను చేసింది,
మార్మిక దర్శనాలు, విధి బెదిరింపులు- అయినా ఆలస్యమయ్యింది
చూడు! కత్తిరించగా మిగిలిన ఈ శిరోజాల మూలాల్ని,
మీ కత్తులు తెంపలేని వాటిని నా వేళ్లు తెంపుతాయి.
ఈ నల్లని ఉంగరాల జుట్టుకు ముక్కలవడం నేర్పబడింది.
ఒకప్పుడవి మంచులాంటి తెల్లని మెడకు అందాన్నిచ్చాయి.
దీని సోదరి జడపాయ ఇప్పుడు ఒంటరిది.
తన సోదరికి పట్టిన గతి తనకూ పడ్తుందని భయపడ్తున్నది.
వంపులు తిరగకుండా వేలాడబడిపోయినది,
హంతక కత్తెర ఆజ్ఞను శిరసావహిస్తూ,
ఇంకోసారి అపవిత్ర హస్తాలను ప్రేరేపిస్తున్నది.
క్రూరత్వమా! నీవు నీకు తక్కువ కనబడిన వాటినే కత్తిరించి
సంతృప్తిపడతావా, లేక, ఇవి తప్ప వేటినైనా కత్తిరిస్తావా!

## 5. బెలిందా ప్రతీకారం

ఆమె అన్నది: వింటున్న ప్రేక్షకులు తడిసి ముద్దయ్యారు కన్నీటితో
అయితే, విధి, జోవ్ ఇద్దరూ 'బారన్' చెవులు మూసివేసారు.
థాలెస్ట్రిస్ ప్రయత్నమంతా వృధా అయ్యింది.

అందాల 'బెలిందా'నే ఓడిపోతే ఇంకెవరు కదిలించగలరు?
సగం మనసు స్థిరపరచుకున్న ట్రోజన్ అక్కడే ఆగిపోయాడా,

‘అన్నా’ బతిమలాడుతున్నా ‘డిడో’ ఆగ్రహం చల్లారిందా?
గంభీరమైన క్లారిస్సా హొయలొలుకుతూ అభిమానికి చేయూపలేదా!

అంతటా నిశ్శబ్దం. మరల క్లారిస్సా మొదలెట్టింది.
చెప్పు, అందానికెందుకు అందరూ పొగడ్తలూ, గౌరవాలనిస్తారు?
తెలివిగలవాడి వ్యాపకం, పనికిరానివాడికి ఆహారం కాదా!
ఎందుకు నేలమీదా, జలధి మీదా దేనికొరకు అన్వేషణ?
ఎందుకు దేవదూతల పిలుపు, ఎందుకు అలాంటివాళ్లని ప్రేమిస్తారు?
ఎందుకు తెల్లటి గ్లవుస్ తొడుక్కున్న యువతుల చుట్టు జనం మూగుతారు?
ఎందుకు వంగుతుంది సైప్‌బాక్సు దాని లోలోపలి శ్రేణి నుంచి?
ఎంత వృధా ఈ కీర్తులు, మన ఈ బాధలు, శ్రమలూ,
అందం పొందినదానిని లోకజ్ఞానం దాచకుంటే!
మగవాళ్లంటారు మనం ఫ్రంట్–బాక్స్ నలంకరించినపుడు–
–‘అటుచూడు, గుణశీలాల్లో ఆమెకామే సాటి, అందంలో సరేసరి!
రాత్రి నాట్యం చేయాలనుకుంటే పగలంతా దుస్తులు మారుస్తుంటుంది.
స్మాల్‌పాక్స్‌కు మంత్రం వేసింది. వృద్ధాప్యాన్ని వెళ్లగొట్టింది.
గృహస్తురాలి చింతల పట్ల తృణీకారం లేనిది
పనికి వచ్చే విషయాన్నొక దానిని నేర్చుకున్నది.
అతుకులు వేస్తుందది, కన్ను కొడ్తుంది, బహుశా సాధువవుతుందేమో!
చిత్రలేఖనం చేసేదేమో అది పాపం అనుకోకుంటే,
అయినా, అందం తాత్కాలికమైనది. అయ్యో, త్వరగా మాసిపోతుంది.
ఉంగరాల జుట్టున్నా, లేకున్నా నెరవాల్సిందే కదా,
రంగువేసినా, వేయకపోయినా మాసిపోవాల్సిందే,
మగవాడిని తిరస్కరిస్తే మిగిలిపోతుంది కన్యగా
అప్పుడే మిగుల్తుంది, అది మన శక్తిని బట్టి ఉంటుంది.
ఏం కోల్పోయినా కాస్త నవ్వుతూ ఉండాలి.
నన్ను నమ్ము, మిత్రమా, మంచి హాస్యం గెలుస్తుంది.
గాలులు, ఎగరడాలు, ఏడ్పులు, తిట్లు ఓడిపోయినప్పుడు
సౌందర్యవతులు వృధాగా వారి కనులను కదిలిస్తారు.
మంత్రాలు చూపును కొడ్తాయి, అర్హత ఆత్మను గెలుస్తుంది.”–

అలా అన్నదామె, అయితే ఎవరూ చప్పట్లు కొట్టలేదు.
బెలిందా భృకుటి ముడిచింది, థాలెస్ట్రిస్ రెచ్చగొట్టింది.
–"ఆయుధాలు, ఆయుధాలు చేబట్టండి" –అన్నదా మగనాలి.
మెరుపు సమానవేగంగా మొదలైంది యుద్ధం
అన్ని వేపులనుంచీ మొదలైంది ఘర్షణ, వివాదం.
విసనకర్రల చప్పుడు, సిల్కు బట్టల సవ్వడి
తిమింగలపు ఎముకలే చూపాయి పగుళ్లు.
హీరో హీరోయిన్ల కేకలు గందరగోళంగా పెరిగాయి.
బేస్ వాయిస్, ట్రిబుల్ సామర్థ్యాలతో నింగి కంటినాయి.
వాళ్ల చేతుల్లో లేవెటువంటి సాధారణ ఆయుధాలు.
దేవతల పోట్లాట, ఒక్క గాయమైనా కానరాదు.

వర్ణించలేదా ధైర్యశాలి హోమర్– దేవతల తగువును,
స్వర్గలోకపు హృదయాలలో మానవ ఉద్వేగాలను,
ఆగ్రహావేశాలతో జరిగిన పోరును!
పల్లాస్‌కు వైరిగా 'మార్స్' దేవుడు,
లటోనాకు ఎదురుగా 'హెర్మెస్' దూకుడు,
ఒలింపియన్ బరిలో విపరీతపు హెచ్చరికలు,
జోవ్ ఉరుముల గర్జనలకు స్వర్గమంతటా కంపనాలు.
నీలి నెప్ట్యూన్ తుఫానులు, పెను అలల ప్రతిధ్వనులు.
తలూపుతున్న తన శిఖరాలను వణికించిన భూమి,
కుంగుతున్న నేల, పగటి మెరుపుల్లో పాలిపోయిన భూతాలు!

విజేత అంబ్రియేల్ రక్షణ కోటపై కూర్చున్నాడు
రెక్కలను సంతోషంగా రెపరెపలాడిస్తూ చూస్తున్నాడు యుద్ధాన్ని.
సూదుల్ని, దబ్బనాలను బల్లెల్లా పట్టుకుని చిన్ని భూతాలు చేస్తున్నాయి సర్వేక్షణ
యుద్ధం ఎక్కువవుతుండగా, ఫ్రే యుద్ధదేవతకు తోడుగా ఉన్నాడు.

థాలెస్ట్రిస్ కోపంగా 'ప్రెస్'లోకి వెళ్లింది.
తన రెండు కళ్లనుంచి మరణాల్ని జల్లింది.

గుంపులో గల్లంతైనారంది ఒక మగనాలి, చతురుడూ,
ఒకడిది ఉత్ప్రేక్షాలంకార మరణం, ఒకడు పాటలో మరణం
–'ఓ క్రూరకన్యా! నేను వింటున్నాను జీవన్మరణం!'–
డాపర్‌విట్ ఆమాట అని కూలబడినాడు కుర్చీలో.
సర్ ఫాప్‌లింగ్ పైకి విసిరాడో విషాదపు చూపును.
ఆ కళ్లు చంపడానికే పుట్టాయన్నాడు చివరకు.
ఆ రకంగా మియాండర్ ప్రవాహపు పూల అంచు పక్కన
పడివున్నది మరణిస్తున్న రాజహంస.
చనిపోతూ ఆలపిస్తుందది హంసగీతం.

ఎప్పుడైతే సాహసికుడైన సర్ ప్లూమ్
క్లారిస్సాను కిందకు లాగగానే, క్లోయి అడుగుపెట్టింది లోనికి.
అతడిని చంపింది తిరస్కారపు చూపుతో,
అంతటి వీరుడూ చనిపోవడం చూసి ఆమె నవ్వింది.
ఆమె నవ్వగానే తిరిగి బతికాడా చనిపోయిన యోధుడు.

ఇప్పుడు 'జోవ్' బంగరు తూనికనుంచాడు గాలిలో.
మగవాళ్ల చతురత ఒకవేపు, స్త్రీల శిరోజాలు మరొకవేపు.
మధ్య ముల్లు అటూ యిటూ తిరిగింది చాలాసేపు
చివరికి గెలిచింది హాస్యం, తలదించుకుంది శిరోజం.

అటుచూడు, బెలిందా ఎంత కోపంగా బారన్‌పై ఎగిరిపడ్తున్నదో.
మామూలుకన్నా ఎక్కువ మెరుపు ఆమె కనులలో.
ఆ అసమాన పోరాటాన్ని చూసి ఎవరూ భయపడలేదు.
ఎవరికి వాళ్లు తమ శత్రువు చావాలనుకున్నారు.
ఈ సాహస ప్రభువుకు మగవాడి బలమున్నది.
అయినా ఆమె తన చూపుడువేలు, అంగుష్ఠంతో ఒడించినది.
అతడి ఊపిరి పోరాడే ముక్కు రంధ్రాలున్న చోట
అక్కడకు విసిరింది ఆ కన్య కాసింత నశ్యాన్ని
భూతాలు సాయం చేసాయి, ప్రతి అణువూ చేరుకుంది లక్ష్యాన్ని

ఆ ఘాటైన రేణువులున్న చక్కిలిగింతల పొగాకు పొడి
కళ్లల్లోంచి తెప్పించింది కన్నీళ్లు నిండుగాను.
అతడి ముక్కు చేసిన శబ్దాలకు ప్రతిధ్వనించింది పైకప్పు.

ఒళ్లు మండిన బెలిందా అరచింది– “నీ ఖర్మ, అనుభవించు”
అని, తన పక్కనుంచి లాగిందొక పదునైన పక్కపిన్ను
అదే, అది పూర్వీకులకు చెందినది.
ఆమె తాత ముత్తాతలు వేసుకున్నారు మెడలో
స్టీలు రింగులు మూడు; వాటిని కరిగించాక
విధవరాలి గౌనుకు అయ్యింది ‘బకిలు’
తరువాత అది ఆమె నాయనమ్మ ఈలగా మారింది.
కాలిగజ్జెలు ఘల్లుఘల్లు, ఈలపాట ఝుల్లుఝుల్లు.
ఆనక అది మారింది వాళ్లమ్మకు తలలో పిన్నుగా!
ఇప్పుడది బెలిందాకు మారింది ఆయుధంగా) – గట్టిగా పొడిచింది
బెలిందా దబ్బనంతో ప్రభువును.

“నేను ఓడిపోయానని గర్వించకు, శత్రువా!” అరిచాడతడు.
నేనూ ఆలోచిస్తా ఇంకోరకం ప్రతీకారం!
నా చురుకైన మనసును అంచనా వేయకు తక్కువ.
నిన్ను వదిలిపెడ్తానని అనుకోకు; అది నేను భరించలేను.
బతికుండి క్యుపిడ్ మంటల్లో కాలిపోతాను గాని
సజీవంగా దహనమవడం నేను భరించలేను. –అరిచాడు ప్రభువు.

“నా శిరోజాలను నాకిచ్చేయి” –అరచిందామె.
“ఇచ్చేయ్, ఇచ్చేయ్” కేకల్తో ప్రతిధ్వనించిందా పైకప్పు.
భీకరుడైన ఒథెల్లో కూడా చేతి రుమాలు
పెట్టిన బాధకు అంత కేకలు పెట్టలేదు.
కాని, చూడు, ఎంత తరచుగా గాఢమైన ఆశయాలు
ఒకదానినొకటి ఖండించుకుంటాయో,

నాయకులు కలహించుకుంటారు తీవ్రంగా
చివరకు బహుమతి కనుమరుగయ్యేంత వరకూ,
వంచనతో సంపాదించిన శిరోజాలు
నేడు తెచ్చాయి కనీవినని బాధను,
ప్రతిచోటా వెదికారు, వెదికారు వృధాగాను.
అటువంటి బహుమతితో ఏ మర్త్యుడూ ఆశీర్వదింపబడలేదు.
అది స్వర్గపు తీర్పు, స్వర్గపు తీర్పును ఎవరు కాదనగలరు?

ఒక ఆలోచన చంద్రమండలానికెగబాకింది.
భూమిమీద పోగొట్టుకున్నవి దాచబడ్తాయట అక్కడ.
అక్కడ హీరోల (నాయకుల) హాస్యాలు దాస్తారు పెద్ద పెద్ద భాండాలలో.
మగనాలుల చతురతలను నశ్యపు పెట్టెలలో, ట్వీజర్ పెట్టెలలో.

వారి వాగ్దానభంగాలు, విరిగిన ప్రమాణాలూ
మరణశయ్యపై దానాలూ అక్కడ ఉంటాయి.
ప్రేమికుల హృదయాలు అద్దబద్దెల చివర కట్టబడి ఉంటాయి.
సభికుల వాగ్దానాలు, జబ్బుమనిషి ప్రార్థనలు,
వేశ్యల చిరునవ్వులు, వారసుల కన్నీళ్లు
దోమలకు పంజరాలు, నల్లులకు సంకెళ్లు
ఎండిన సీతాకోక చిలుకలు, ధర్మశాస్త్రజ్ఞుల సమాధులు-

అయితే 'మ్యూజ్'ను నమ్ము- ఏదో కాంతిపుంజం పైకెగరడాన్ని చూసిందామె.
కవి కనులతో చూసింది ఎవరూ గమనించనివాటిని.
(రోమ్ నిర్మాత స్వర్గానికి వెళ్లినాడు,
ప్రొక్యులస్‌కు మాత్రమే ఆ విషయం చెప్పినాడు).
అకస్మాత్తుగా ఓ నక్షత్రం, ద్రవ వాయువులోకి దూసుకువెళ్లింది.
దానినంటిపెట్టుకున్నది మెరుస్తున్న శిరోజపు దారి.
బెర్నైస్ శిరోజాలు కూడా అంతగా ప్రకాశించలేదు.
ఆ అద్భుత కాంతితో మెరిసింది ఆకాశమంతా.
అది ఎగిరిపోతుంటే వాయుభూతాలు చూసాయి

ఆకాశంలో దాని దారిని సంతోషంగా వీక్షించాయి.
దీనిని బ్యు-మోండె సర్వేక్షణ చేస్తుంది వస్తుబజార్లో.
తన అనుకూల కిరణాల, సంగీతంతో జేజేలు కొడ్తుంది.
దీనిని ఆశీర్వదింపబడిన ప్రేమికుడు 'వీనస్' వద్దకు చేరుస్తాడు.
'రోజామాండ్' సరస్సు నుంచి ప్రమాణాలను పంపిస్తాడు.
మబ్బులు లేని నింగి నుండి 'పార్ట్రిడ్జ్' వీక్షిస్తుంది.
'గెలీలియో' కనులలోకి తొంగి తొంగి చూస్తుంది.
అప్పుడు అతిశయించిన మంత్రగాడు ప్రకటిస్తాడు జోస్యం
ప్రభువు లూయిస్ భవితవ్యం, రోమ్ సామ్రాజ్య పతనం.

అప్పుడు, ఆగు, ప్రకాశవంతమైన కన్యా! చూడు
బలాత్కరించబడిన నీ శిరోజాల్ని చూడు!
అవమానించబడిన నీ జడపాయను చూడు
ఈ గ్రహమండలానికి నూతన శోభను ఇస్తున్నదిప్పుడు.
నీ తలపై ఉన్న అందమైన శిరోజాలన్నీ కూడా
నీవు పోగొట్టుకున్న ముంగురుల సాటి చేయలేవు.
అసూయను పెంపొందించే ఆ శిరోజాలు
నీ నేత్రాల హంతకులు, కాదా, మరి!
మిలియన్ల జనంతోపాటు నీవు కూడా మరణిస్తావు
అందమైన సూర్యుడు అస్తమించేప్పుడు, అస్తమించకతప్పదు!

ఆ అందమైన శిరోజాలన్నీ మట్టిలో కలుస్తాయి.
ఈ ఒక్క జడపాయకు, మ్యూజ్ దేవత అనుగ్రహిస్తుంది శాశ్వత గౌరవం
అశేష నక్షత్రాల మధ్య లిఖించబడ్తుంది
చిరస్థాయిగా 'బెలిందా' నామం.

✧✧✧✧✧

# అలెగ్జాండర్ పోప్
## (Alexander Pope 1688-1744)

పదిహేడవ శతాబ్దపు ఇంగ్లీషు కవి. అద్భుత వ్యంగ్య రచనలకు, హోమర్ ఇతిహాసాల అనువాదకుడిగా, Heroic Couplet (ప్రాసతో కూడిన ద్విపద)ను ప్రతిభావంతంగా వాడిన కవిగా పేరు తెచ్చుకున్నాడు. The Oxford Dictionery of Quotations - పోప్‌కు Shakespeare తరువాత స్థానాన్నిచ్చింది– 'Second most frequently quoted writer' గా.

1711 ప్రాంతంలో 'పెట్రె' ఏడవ ప్రభువు, రాబర్ట్, తనకు పరిచయమున్న మిస్ అరబెల్లా ఫెర్మార్ జడపాయనొక దానిని కత్తిరించాడు. ఆ సంఘటన రెండు ధనిక కుటుంబాల మధ్య ఉన్న చిరకాల స్నేహానికి ముప్పు తేబోగా రెండు కుటుంబాలకు స్నేహితుడైన జాన్ కారిల్, తమ గ్రూపులోని కవి Alexander Pope ను – Write a poem to make a Jest of it and laugh them together again' - అని సలహా ఇచ్చాడు. ఆ రకంగా 'బెలిందా' పేరుతో Arabella fermor పేరు చిరస్థాయిగా నిలిచింది. కవిత్వపు అంతరిక్షంలో బెలిందా శిరోజాలు 'The Rape of the Lock' పేరుతో కాంతివంతమైన నక్షత్రరాశిగా శాశ్వతంగా ప్రకాశిస్తున్నవి.

1712లో రెండు భాగాలుగా వ్రాయబడి Anonymous పేరుతో ప్రచురింపబడి, Addison లాంటి వాళ్లమెప్పును పొందినా, వారి సలహాను లెక్క చేయక, పోప్ ఈసారి వాయుభూతాలైన సిల్ఫ్ (Sylph)లను చేర్చి అయిదు భాగాలుగా పెంచి, అత్యద్భుతమైన పోలికలతో కమనీయమైన కావ్యంగా మలిచి– The Rape of the Locke - A Heroric-comical Poem గా ప్రచురించినాడు.

'It is made of gauzee and silver spangles' అన్నాడు Hizlitt... It is the perfection of the mock-heroic"

కథనంలో తళుక్కున మెరిసే ప్రాచీన ఇతిహాసాల పాత్రలు– Homer, Virgil, Spenser, Milton ల రచనలనుంచి తారల్లా మెరిసి కాంతులీనుతుంటాయి.

'బెలిందా'ను రంగులు వేయబడి థేమ్స్ నదిలో పయనిస్తున్న నావగా, ఆ తెరచాప స్తంభం చుట్టూరా పరివేష్టించిన వాయుభూతాలు 'సిల్ఫ్'లు 'Sylphs'

ఆ వర్ణనలు పాఠకులను ఆశ్చర్యానందాలలో ముంచెత్తుతాయి. వ్యంగ్యం, వాస్తవికవాదం, భావవాదం ఇలా అనేక ప్రక్రియలు ఈ కవితలో చోటు చేసుకున్నాయి. పేకాటను యుద్ధంగా చిత్రీకరించిన తీరు, పేకాట గదిని, పాతాళంలోని గుహ (Grotto) గా; మెలాంఖొలి (Melancholy) భావాన్ని 'Spleen' గా పలికించడాలు ఈ కవితలో కొన్ని అద్భుతాంశాలు.

ఈ కవిత ఫెర్మార్, పెట్రె కుటుంబాల మధ్య స్పర్ధలను కొంత తగ్గించినా, ఈ కవిత ప్రచురించకముందే పెట్రె వేరే ధనిక కుటుంబపు వారసురాలిని వివాహ మాడినాడు. దురదృష్టవశాత్తు ఒక ఏడాదిలోపుగానే 23 ఏళ్ల వయసులో Small Pox తో మరణించినాడు. రవి గాంచనిది కవి గాంచగలడన్నది ఈ కవిత ఋజువు చేస్తుందనడానికి–

–'ఏమిటా దయ్యపు వ్యవహారం– అయ్యో స్ఫోటకమా! ఇచ్చేయి ఆమె శిరోజాల్ని... – nay prithee, Pox; Give her the hair' – అన్న పంక్తులలో గమనించగలం.

అరబెల్లా (బెలిందా) 1714–15 ప్రాంతంలో బెర్క్షైర్ వాసిని పెండ్లాడింది. ఆరుగురు పిల్లల్ని కన్నది. నలభై ఏడేళ్ల వయసులో కన్నుమూసింది (1738) తన భర్త చనిపోయిన పదకొండు నెలలకు.

కాని, ఆమె పేరు శాశ్వతంగా నిలిచింది కవిత్వాకాశాన.

- "This Lock, the Muse shall consecrate to fame
And midst the Stars inscribe Belinda's name.

–"ఈ ఒక్క జడపాయకు 'మ్యూజ్' అనుగ్రహిస్తుంది శాశ్వత గౌరవం అశేష నక్షత్రాల మధ్య వ్రాయబడ్తుంది చిరస్థాయిగా 'బెలిందా' నామం"–

The Rape of the Lock - రెండవ కూర్పు అయిదు భాగాలుగా, 794 పంక్తులతో ఉన్నది 1714లో ప్రచురింపబడి నాలుగు రోజుల్లో మూడువేల కాపీలు అమ్ముడైనదంటారు Alexander Pope.

హెలెన్ అపహరణను శిరోజాల మానభంగంగా, ఎఖిల్లిస్ డాలు, బెలిందా పెట్టికోటు పైనున్న excursus గా, ఫ్రెంచి రొజిక్రుసియన్ నవల Comte

de Gabalis లో నుంచి సిల్ఫ్ –వాయు భూతాలు పాత్రధారులుగా ఈ కవిత సొబగులనద్దుకున్నది.

Burlesque - Burla (Italian)- Joke, ridicule or mockery - హాస్య సంభాషణ, ఎగతాళి The Rape of the Lock ను High burlesque కు ఉదాహరణగా విమర్శకులు పేర్కొంటారు.

**పాత్రలు–**

1) బెలిందా– ఉంగరాల ముంగురులున్న అందమైన ధనిక కన్య.
Belinda (Arabella Fermor)
2) ప్రభువు (Lord Petre, Baron) – బెలిందా శిరోజాలను కత్తిరించి తన వద్ద దాచుకోవాలనుకున్నవాడు, ఆమెను వివాహం చేసుకోవాలనుకున్నవారిలో ఒకడు (Suitor).
3) ఏరియల్– (బెలిందా రక్షక భూతం) సిల్ఫ్‌ల నాయకుడు.
4) సిల్ఫ్‌లు – వాయు భూతాలు (Sylphs)
5) అంబ్రియేల్ (Umbriel) – దిగులు భూతం. బెలిందా దుఃఖాన్ని ఎక్కువ చేసినాడు.
6) థాలెస్ట్రిస్ (Thalastris) – బెలిందా స్నేహితురాలు, తిరుగుబాటుదారు.
7) క్లారిస్సా (Clarissa) – బెలిందా పరిచయస్తురాలు, బారన్‌కు కత్తెరనిచ్చినామె.
8) సర్ ప్లూమ్ (Sir Plume) – బెలిందా సోదరుడు థాలెస్ట్రిస్‌కు ఇష్టమైనవాడు.
9) షాక్ (Shock) – బెలిందాకు ఇష్టమైన Spaniel dog కుక్క.
10) స్లీన్ (Spleen)– చెడు ఉద్వేగాలకు రాణి (Bad Tempers)
11) బెట్టీ (Betty)– బెలిందా పరిచారకురాలు.
12) బ్రిల్లాంటి (Brillante)– చెవి కమ్మలకు సంరక్షణాభూతం.
13) మొమెంటిల్లా (Momentilla)– గడియారానికి సంరక్షణాభూతం.
14) క్రిస్పిస్సా (Crispissa)– శిరోజాలకు రక్షణాభూతం.
15) కారిల్ (Caryl)– జాన్ కారిల్ (John Caryll).
పెట్రె, ఫెర్మార్ కుటుంబాలకు, పోప్‌కు స్నేహితుడు.
16) జెఫిరెట్టా (Zephirette)– పశ్చిమగాలి కన్య.
17) మ్యూజ్ (Muse)– లలితకళాధిదేవత, సరస్వతి.
18) బోడ్‌కిన్ (Bod-Kin)– దబ్బనం లాంటి పిన్ను గౌను కుచ్చిళ్లు జారకుండా ఉంచేది.

## Dr. LANKA SIVA RAMA PRASAD

M.B.B.S; M.S (General Surgery);
M.Ch (Cardio Thoracic & Vascular Surgery)
FIVS (Fellow in Vascular Surgery)
Post Graduate Diplomate in Human Rights
Post Graduate Diplomate in Television Production
Web Engineer- Web Designer
Fellow of Indo- Asian Poetry Society
Founder of Writer's Corner / Srijana Lokam
Columnist - Andhra Jyothi (Nivedana)
Cell Animation Artist (Heart Animation Acadamy - Hyderabad)
Computer Animation Specialist (Pentafour- Chennai)
Founder of Waves (Warangal Aids Voluntary Educational Society)

# డాక్టర్ లంకా శివరామప్రసాద్ రచనలు

**కవిత్వం (తెలుగు) (Poetry) :**

1. ఆల్కెమీ
2. వానమబ్బుల కాంతిఖడ్గం
3. టీకప్పులో తుఫాను
4. తంగేటి జున్ను
5. కర్కాటకం (క్యాన్సరు) (First Poetry Book about Cancer in Telugu)
6. ఒక సరస్సు–అనేక హంసలు (First Poetry Book about Psychiatry in Telugu)
7. మరణ శాసనం – దీర్ఘ కవిత.
8. శ్రీ లలితాసహస్రనామ స్తోత్రం

**కవిత్వం (ఇంగ్లీషు) (Poetry) :**

1. **Shades**
2. **The Twilight Zone**

**నవలలు (Novels) :**

1. **In Search of Truth (English)**
2. సత్యాన్వేషణలో (తెలుగు)
3. జీనోమ్ (తెలుగు) (First Biotechnology Novel in Telugu)

**కథలు, వ్యాసాలు (Stories, Essays) :**

1. కత్తి అంచుపై... (First Noir Stories in Telugu)
2. ఛుప్ కె ఛుప్ కె (రహస్యభాష) (స్త్రీల వ్యాధులు)
3. అక్షరార్చన

**ఇతరాలు** (Others) :

1. దీప నిర్వాణగంధం (About Death)
2. స్వప్నశాస్త్రం (Dreams-1)
3. కలలు–పీడకలలు (Dreams-2)
4. సంఖ్యాశాస్త్రం (Numerology)
5. **How to be Happy**
6. డా. జయదేవ్ కార్టూన్లు
7. **Bouquet of Telugu Songs and Poems**

**అనువాదాలు** (English to Telugu) Translations :

1. ఇలియాడ్ (Homer) - **Iliad**
2. ఒడెస్సీ (Homer) - **Odyssey**
3. ఎపిక్ సైకిల్ (Homer) - **Epic Cycle**
4. మూడు గ్రీకు ట్రాజెడీలు - **Three Greek Tragedies**
5. ఈనీడ్ (Virgil) - **Aenied**
6. తీర్థయాత్రికుని ప్రగతి (John Bunyan) - **Pilgrims Progress**
7. పారడైజ్ లాస్ట్ & రిగైన్డ్ (John Milton) - **Paradise Lost & Paradise Regained**
8. డివైన్ కామెడీ (Dante) - **Divine Comedy**
9. ఫాస్ట్ (Goethe) - **Faust**
10. నామదేవొ ధసాల్ కవిత్వం (NamDeo Dhasal) Poetry
11. ప్రపంచ ప్రసిద్ధ కథలు (World Famous Stories)
12. విలియం బ్లేక్ కవిత్వం (William Blake Poetry)
13. రసధుని (Russian Poetry)
14. జలపాతం (అష్టాదశ ఆంగ్ల కవుల కవిత్వం) (18 English Poets)
15. క్రీస్తు అద్భుతగీతాలు (The Wonderful Poems on Christ)
16. క్రీస్తు నడచిన దారి (The Path of Christ)
17. మస్నవి 1 – 6 (మౌలానా జలాలుద్దీన్ రూమి) - **Masnavi**
18. పక్షుల సభ (ఫరీదుద్దీన్ అత్తర్) - **Conference of Birds**
19. శిలప్పదికారం (తమిళ సాహిత్యం) - **Silappadikaram**
20. మణిమేఖల (తమిళ సాహిత్యం) - **Manimekhala**
21. తమిళ సరస్వతి అందెల రవళి (తమిళ సాహిత్యం) - **Sangam Poetry**
22. డబ్బు–మని–షి - **Money Poetry**
23. శాంతి యుద్ధం - **War-Peace Poetry**

24. **ఎమిలి డికెన్‌సన్ కవిత్వం 1-5** (తెలుగులో)
25. **సౌగంధిక** (కవిత్వం)
26. **తూర్పు-పడమర** (కవిత్వం) (Master Poems in English)
27. **ప్రేమ కురిసిన వేళలో...** (కవిత్వం) (Master Poems in English)
28. **వాళ్లు ముగ్గురు** (కవిత్వం) (Master Poems in English)
29. **అలనాటి కొత్తగాలి** (కవిత్వం) (Master Poems in English)
30. **మంచు తుఫాను** (కవిత్వం) (Master Poems in English)

**<u>అనువాదాలు</u>** (తెలుగు మరియు ఇతర భాషల్నుంచి ఇంగ్లీషులోకి) **Translations :**

1. **Modern Bhagavad Geeta** (Poetry) (Vyasa)
2. **Soundarya Lahari** (Poetry) (Sankaracharya)
3. **Bhagavatam** (Poetry) (Potana)
4. **Samparayam** (Poetry) (Suprasanna)
5. **The Tree of Fire** (Poetry) (Anumandla Bhoomaiah)
6. **The Pool of Blood** (Novel) (Ampasayya Naveen)
7. **The Poems of Kuppam** (Poetry) (Seeta Ram)
8. **The Broken Grammar** (Poetry) (T.W. Sudhakar)
9. **We need a language** (Poetry) (T.W. Sudhakar)
10. **This is No Streaking** (Stories) (K.K. Menon)
11. **The Voice of Telangana** (Poetry) (Madiraju Ranga Rao)
12. **Satarupa** (Poetry) (A.K. Khanna)
13. **Fire & Ice** (Poetry) (Rama Chandramouli)
14. **హిందీ నుంచి తెలుగులోకి – మధుశాల (హరివంశరాయ్ బచ్చన్)**

**<u>శతకాలు</u> (Poetry) :**

1. **కుయ్యోమొర్రో శతకం**
2. **భైరవ శతకం**
3. **కాయగూర శతకం**
4. **అయ్యబాబోయ్ శతకం**

**<u>త్వరలో</u> (Poetry) :**

1. **దైవమార్గం (మహమ్మదీయ మతం)** (Poetry)
2. **సెలయేరు** (Master Poems - English to Telugu)
3. **ఎండా-వానా** (కవిత్వం) (Master Poems in English)

4. **పిల్లనగ్రోవి పిలుపు** (కవిత్వం) (Master Poems in English)
5. **నాలుగు దిక్కులు** (కవిత్వం) (Master Poems in English)
6. **అల్లంత దూరాన ఆ పాట వినవచ్చె** (కవిత్వం) (Master Poems in English)
7. **దివ్య వస్త్రాల కోసం** (కవిత్వం) (Master Poems in English)
8. **ఆమని** (కవిత్వం) (Master Poems in English)
9. **ఒక మధుశాల** (కవిత్వం) (Master Poems in English)
10. **కొత్త దీపాలు** (కవిత్వం) (Master Poems in English)
11. **మరుభూమి** (కవిత్వం) (Master Poems in English)
12. Odysseus Elytis '**The Axion Esti**' **Worthy it is - ఇది విలువైనది.**
13. Frederico Garfcia Lorca "**Love & Death**" - **ప్రేమ – మృత్యువు**
14. **పదివేల పంక్తులు (ప్రపంచశాంతి కోసం) ఎడ్విన్ కార్డివిల్లా (Part-I)**
15. Bees Need No Invitation When Flowers Bloom...
16. **పాబ్లో నెరుడా కవిత్వం-1**

ప్రపంచ సాహిత్యం-41

# ఎండా-వానా

Master Poems of the English Language

ఆండ్రూ మార్వెల్, జాన్ డ్రైడన్, జాన్ విల్మాట్, జోనాథన్ స్విఫ్ట్,
అలెగ్జాండర్ పోప్‌ల దీర్ఘ కవితలు
ఈ 'ఎండా-వానా' అనువాద కవితా సంపుటిలో చోటు చేసుకున్నాయి.
గ్రీకు, లాటిన్, జర్మనీ, రష్యన్, ఇంగ్లీషు, తమిళం, పర్షియన్
భాషా సాహిత్యాలలోని అతి ముఖ్యమైన గ్రంథాలను తెలుగులోకి
అనువదించి సాహితీ ప్రియుల మన్ననలనందుకున్న సృజనలోకపు
ఈ ప్రయత్నాన్ని కూడా పాఠకులు విశేషంగా ఆదరిస్తారని ఆశిస్తున్నాము.

## డాక్టర్ లంకా శివరామప్రసాద్